



కలశాలకు పూజలు నిర్వహిస్తున్న శ్రీశైల జగద్గురు పీఠాధిపతి చెన్నసిద్ధరామ పండితారాధ్య శివాచార్య మహాస్వామి

వైభవంగా మహా కుంభాభిషేకం





స్వామివారి ఆలయం గోపురంపై త్రిశూల కలశానికి పూజలు నిర్వహిస్తున్న కంచి పీఠాధిపతి

పాల్గొన్న కంచి, శ్రీశైలం జగద్గురు, పుష్పగిరి, కాశీ పీఠాధిపతులు



కలశాలకు సంప్రోక్షణ చేస్తున్న పీఠాధిపతి

శ్రీశైలం, ఫిబ్రవరి 21: భూ మండలానికి నాభి స్థానమైన శ్రీశైల మహా క్షేత్రంలో బుధవారం మహా కుంభాభిషేకం మహోత్సవ కార్యక్రమాన్ని దేవస్థానం వైభవంగా జరిపించింది. ఆరు రోజులపాటు నిర్వహించిన ఈ మహిమాన్విత కార్యక్రమంలో కలశాలను నెలకొల్పి, ఆయా కలశాలలో దేవతాశక్తిని నిక్షిప్తం చేసి, జప, పారాయణ, ధ్యాన, హోమాదులను జరిపారు. రాష్ట్ర కల్యాణం, ప్రజా సంక్షేమం కోసం చేపట్టిన మహాకుంభాభిషేకం మహోత్సవం సందర్భంగా ఆలయంలో స్వామి, అమ్మవార్లకు ప్రతి రోజూ విశేష పూజలు, దేవతాహవనాలు, దేవహవనాలు, జపాలు, పారాయణాలు జరిపించారు. ఉదయం 7గంటల నుంచి 12 గంటల వరకు జరిగిన మహాకుంభాభిషేకంలో భాగంగా శాంతి హోమం, పౌష్టిక హోమం, మహాపూర్ణాహుతి కార్యక్రమాలు పూర్తి చేసి అనంతరం ఆలయంలో పునర్నిర్మించిన శివాజీ గోపురానికి సువర్ణ కలశ ప్రతిష్ఠ, ఆలయ ప్రాంగణంలో పునరుద్ధరించిన కొన్ని ఉప ఆలయాలు, పంచమఠాలలోని మూడు మఠాలలో యంత్ర, శివలింగ, నందీశ్వరుల ప్రతిష్ఠలను శాస్త్రానుసారంగా చేశారు. అనంతరం ప్రధానాలయంలోని స్వామి వారి గర్భాలయ విమానం, అమ్మవారి గర్భాలయ విమానం, నాలుగు దిక్కుల ప్రధాన గోపురాలు, అమ్మవారి ద్వార గోపురం, ఆలయ ప్రాంగణంలోని అన్ని గోపురాలు, క్షేత్ర పరిధిలోని ఉప ఆలయాలకు ఏకకాలంలో మహా కుంభాభిషేకం నిర్వహించారు. ఈ మహిమాన్విత కార్యక్రమంలో కంచికామకోటి పీఠాధిపతి విజయేంద్ర సరస్వతి మహాస్వామి, శ్రీశైల జగద్గురు పీఠాధిపతి చెన్నసిద్ధరామ పండితారాధ్య శివాచార్య మహాస్వామి, పుష్పగిరి పీఠాధిపతి విద్యాశంకర భారతీ మహాస్వామి, కాశీ పీఠాధిపతి మల్లికార్జు విశ్వరాధ్య శివాచార్య మహాస్వామి పాల్గొన్నారు. కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి, దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ, నంద్యాల ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, స్థానిక ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి, దేవదాయశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కరికాల్ వళవన్, దేవదాయశాఖ కమిషనర్ సత్యనారాయణ, దేవదాయశాఖ జాయింట్ కమిషనర్ ఎస్.ఎస్ చంద్రశేఖర్ ఆజాద్, విజయవాడ దుర్గాదేవి ఆలయ కార్యనిర్వహణాధికారి కేఎస్ రామారావు, ధర్మకర్తల మండలి అధ్యక్షులు రెడ్డివారి చక్రపాణిరెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.



కుంభాభిషేకంలో పాల్గొన్న పుష్పగిరి పీఠాధిపతి విద్యాశంకర భారతీ మహాస్వామి



శివాజీ గోపురంపై కలశస్థాపన





ఆలయంలోకి వస్తున్న దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ దంపతులు, ఆలయ అర్చకులు, అధికారులు



ఈనాడు, ఆంధ్రజ్యోతిపై దాడి వెనుక సీఎం జగన్



నంద్యాల పట్టణంలో ధర్నాలో నినాదాలు చేస్తున్న వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ప్రజాసంఘాల నేతలు, జర్నలిస్టులు

- ఈ ఘటనలు రాజ్యాంగ వ్యతిరేకం
- జర్నలిజం లేకుంటే దేశంలో నియంతృత్వమే
- ధర్నాలో పార్టీలు, ప్రజా సంఘాలు

నంద్యాల రూరల్, ఫిబ్రవరి 21: రాష్ట్రంలో పత్రికలపై జరుగుతున్న దాడుల వెనుక ముఖ్యమంత్రి వైఎస్ జగన్ హస్తం ఉందని పలు పార్టీలు, ప్రజా సంఘాల నాయకులు ఆరోపించారు. కర్నూలు జిల్లా కేంద్రంలో ఈనాడు కార్యాలయంపై వైసీపీ మూక దాడిని నిరసిస్తూ పార్టీలు, ప్రజా సంఘాలు, ఏపీయూడబ్ల్యూజేఎఫ్ ఆధ్వర్యంలో బుధవారం తాలుకా పోలీస్ స్టేషన్ ఎదుట ధర్నా, మానవహారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి, ప్రముఖ న్యాయవాది టి.తులసిరెడ్డి మాట్లాడుతూ పత్రికలపై దాడి చేయడమంటే రాజ్యాంగాన్ని అవహేళన చేయడమే అన్నారు. ప్రజలచే ఎన్నుకున్న వ్యక్తులు ఇలా దాడులకు తెగబడటం సరికాదని హితవు పలికారు. తెలుగుదేశం పార్టీ నంద్యాల జిల్లా కార్యదర్శి ఎన్.ఎం.డి. ఫిరోజ్ మాట్లాడుతూ రాష్ట్రంలో గత కొన్నేళ్లుగా వైసీపీ మూకల దాడులు నిత్యకృత్యమయ్యాయన్నారు. ఈ దాడులను ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఖండించలేదంటే, వాటి వెనుక ఆయన హస్తం ఉన్నట్లేనని ఆరోపించారు. ప్రముఖ న్యాయవాది, సీపీఎం నాయకుడు శంకరయ్య మాట్లాడుతూ పత్రికా వ్యవస్థపై దాడి భావప్రకటనా స్వేచ్ఛను హరిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఎ.నాగరాజు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పత్రికా స్వేచ్ఛను హరిస్తోందని, జగన్ తన పోకడలను మార్చుకోవాలని డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ, డీఐఎఫ్ఐ నాయకులు డక్కా కుమార్, శివ, డిజేబుల్డ్ రైట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు డీపీ మస్తాన్ వలి, ఉపాధ్యక్షుడు కిరణ్ కుమార్, సహాయ కార్యదర్శి ఎల్లయ్య పత్రికా వ్యవస్థపై దాడి ప్రజాస్వామ్యంపై దాడే అన్నారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ రమాదేవికి వినతి పత్రం ఇచ్చారు. కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి ప్రసాద్, జనసేన సమన్వయ కర్త విశ్వనాథ్, నియోజకవర్గ ఇన్‌చార్జి పి.సుధాకర్, సమాజ్‌వాది పార్టీ జిల్లా ఇన్‌చార్జి కృష్ణ యాదవ్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు కుమార్, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు ధనుంజయ్, పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి రాంబాబు, డీవైఎఫ్ఐ పట్టణ కార్యదర్శి శివ, సీఐటీయూ జిల్లా కార్యదర్శి వి. బాలవెంకట్, ఏఐటీయూసీ పట్టణ కార్యదర్శి శ్రీనివాసులు, టీడీపీ మండల కార్యదర్శి మండ్ల గుర్రప్ప, ఏపీడబ్ల్యూజే రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు డి. మౌలాలి, జిల్లా ఉపాధ్యక్షుడు మాదాల శ్రీనివాసులు, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు, కాకర్ల శివ, ఆలమూరు జగన్, కోశాధికారి మస్తాన్, పట్టణ ఉపాధ్యక్షులు జాషువ సభ్యులు సుబ్బరాయుడు, విజన్ టీవీ జోసెఫ్ తదితరులు పాల్గొన్నారు.



డిప్యూటీ తహసీల్దార్ రమాదేవికి వినతి పత్రం ఇస్తున్న దృశ్యం



కర్నూలులో ధర్నా చేస్తున్న నాయకులు

కర్నూలులో కదం తొక్కిన జర్నలిస్టులు



మాట్లాడుతున్న ఐవీ సుబ్బారావు

కర్నూలు (కల్చరల్), ఫిబ్రవరి 21: కర్నూలు ఈనాడు ప్రాంతీ య కార్యాలయంపై పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అనుచరులు, వైసీపీ మూకల దాడులు.. మద్దికెర ఆంధ్రజ్యోతి విలేకరి కే వీరశేఖర్‌పైన వైసీపీ దాడిని నిరసిస్తూ ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఏపీయూడబ్ల్యూజే) ఆధ్వర్యంలో జర్నలిస్టులు రోడ్డెక్కారు. జర్నలిస్టులపై దాడులకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ దాడులకు పాల్పడిన వారిపై కేసులు నమోదు చేసి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. బుధవారం కర్నూలు కలెక్టరేట్ ముందు మహాత్ముని విగ్రహం వద్ద ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు ఐవీ సుబ్బారావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ధర్నా కార్యక్రమానికి టీడీపీ, సీపీఐ, సీపీఎం, జనసేన, సీఐటీయూ, ఏఐటీయూసీ, ఏఐఎస్ఎఫ్ వంటి ప్రజా సంఘాల నాయకులు హాజరై మద్దతు ఇచ్చారు. ఈ సందర్భంగా ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు ఐవీ సుబ్బారావు మాట్లాడుతూ జగన్మోహన్‌రెడ్డి సీఎంగా బాధ్యతలు చేపట్టిన తొలి సభలోనే పత్రికలపై తన అక్కసు వెళ్లగక్కారన్నారు. కర్నూలులో ఈనాడు ప్రాంతీయ కార్యాలయం, ఎమ్మెల్యే శ్రీదేవి సమక్షంలో మద్దికెర ఆంధ్రజ్యోతి విలేకరిపై దాడులు చేయడం చూస్తే రాష్ట్రంలో అంబేడ్కర్ రాజ్యాంగం అమలవుతోందా అన్న అనుమానం కలుగుతోందని అన్నారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు బీటీ నాయుడు, పాణ్యం, ఆలూరు ఇన్‌చార్జిలు గౌరు చరిత, కోట్ల సుజాతమ్మ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థపై జగన్, వైసీపీ ఎమ్మెల్యేలకు నమ్మకం లేదని, రాబోయే ఎన్నికల్లో ప్రజలను భయాందోళనకు గురి చేసేందుకే పత్రికలు, జర్నలిస్టులపై దాడులకు తెగబడుతున్నారని ఆరోపించారు. తాడేపల్లి నుంచి వచ్చిన ఆదేశాల మేరకే ఈనాడు కార్యాలయంపై దాడి చేశారని, దాడులకు పాల్పడిన వైసీపీ కార్యకర్తలపై కేసులు నమోదు చేసి తక్షణమే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టుల నిరసనకు టీడీపీ కర్నూలు, నంద్యాల జిల్లాల అధ్యక్షుడు బీటీ నాయుడు, మల్లెల రాజశేఖర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు, పాణ్యం, ఆలూరు టీడీపీ ఇన్‌చార్జిలు గౌరు చరిత, కోట్ల సుజాతమ్మ, టీడీపీ నాయకులు పీజీ నరసింహులు యాదవ్, నాగేశ్వరరావు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

తండ్రీ కొడుకులకు ఉరిశిక్ష

- జంట హత్యల కేసులో భర్త, మామలకు ఉరి, అత్తకు యావజ్జీవం
- ఏడాదిలోపే సంచలన తీర్పు ఇచ్చిన కర్నూలు నాల్గవ అదనపు జిల్లా సెషన్స్ కోర్టు

కర్నూలు కోర్టులో సంచలనాత్మక తీర్పు వెలువడింది. ఓ కేసులో తండ్రీ కొడుకులకు ఉరిశిక్ష విధిస్తూ కోర్టు తీర్పు ఇచ్చింది. మరొకరికి జీవిత ఖైదు విధించింది. కర్నూలు నాలుగో అదనపు జిల్లా కోర్టు ఇచ్చిన ఈ తీర్పు ఇప్పుడు సంచలనంగా మారింది. పెళ్లయిన పద్నాలుగు రోజులకే అనుమానంతో భార్య, అత్తను చంపి మామను తీవ్రంగా గాయపరిచిన కేసులో ఇద్దరికి ఉరి శిక్ష, ఒకరికి జీవిత ఖైదు విధిస్తూ కర్నూలు నాలుగో అదనపు జిల్లా సెషన్స్ కోర్టు న్యాయాధికారి జి. ప్రతిభాదేవి బుధవారం సంచలన తీర్పునిచ్చారు.

కర్నూలు(లీగల్), ఫిబ్రవరి 21: ప్రాసిక్యూషన్ కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. నంద్యాల పట్టణానికి చెందిన నారపురం వరప్రసాద్, నారపురం రమాదేవి, వారి కుమారుడు నారపురం శ్రావణ్ కుమార్‌లు కర్నూలు నగరంలోని కల్లూరు చింతమునినగర్‌కు వచ్చి స్థిరపడ్డారు. కాగా శ్రావణ్ కుమార్‌కు గతేడాది మార్చి ఒకటో తేదీన తెలంగాణ రాష్ట్రం వనపర్తి పట్టణానికి చెందిన కొత వెంకటేశ్, రమాదేవిల కుమార్తె రుక్మిణితో వివాహం జరిగింది. అయితే పెళ్లయిన మూడు రోజులు కూడా వారి మధ్య శోభనం జరగలేదు. దీంతో నవ వధువు తండ్రి వరప్రసాద్, ఆమె తల్లి రమాదేవి అల్లుడు శ్రావణ్ కుమార్‌పై అనుమానపడ్డారు. శ్రావణ్‌కు మగతనం లేకపోవడంతోనే వారి మధ్య శోభనం జరగలేదంటూ అల్లుడితో పాటు వియ్యంకులపై గొడవపడ్డారు.



శిక్షకు గురైన నిందితులు శ్రావణ్ కుమార్, వరప్రసాద్, రమాదేవి

అయితే.. రుక్మిణికి వివాహేతర సంబంధం ఉందని అందుకే వారి మధ్య శోభనం జరగలేదని శ్రావణ్ కుమార్, అతడి తల్లిదండ్రులు ఆరోపించారు. దీంతో రుక్మిణిని ఆమె తల్లిదండ్రులు పుట్టింటికి తీసుకెళ్లారు. అయితే ఈ విషయం అందరికీ తెలిస్తే తమ పరువుపోతుందని భావించిన నిందితులు రుక్మిణితో పాటు ఆమె తల్లిదండ్రులను హత మార్చాలని నిర్ణయించుకున్నారు. ఆ తర్వాత ప్రణాళిక ప్రకారం గత ఏడాది మార్చి 11న శ్రావణ్ కుమార్ తన రుక్మిణి (19)ని, అత్త రమాదేవి (32)ని, మామ వెంకటేశ్‌లను వనపర్తి నుంచి కర్నూలుకు తీసుకువచ్చారు. తమ పథకంలో భాగంగా తల్లి కృష్ణవేణిని ఇంటి బయట కాపలాగా ఉంచి శ్రావణ్ కుమార్ వరప్రసాద్‌తో కలిసి రుక్మిణిని, రమాదేవిని కత్తులతో పొడిచి హత్య చేశారు. అడ్డు వచ్చిన వెంకటేశ్‌ను కూడా తీవ్రంగా గాయపరిచారు. వీరి కేకలు విన్న ఇరుగు పొరుగు వారు అక్కడకు రావడంతో నిందితులు పారిపోయారు. వెంకటేశ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కర్నూలు నాల్గవ పట్టణ సీఐ పి. శంకరయ్య కేసు నమోదు చేసి కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు. కోర్టులో నిందితులపై నేరం రుజువు కావడంతో శ్రావణ్ కుమార్, అతడి తండ్రి వరప్రసాద్‌కు ఉరి శిక్ష, వారికి సహకరించిన తల్లి కృష్ణవేణికి జీవితఖైదు విధిస్తూ కోర్టు తీర్పునిచ్చింది. ప్రాసిక్యూషన్ తరఫున పబ్లిక్ ప్రాసిక్యూటర్ వై. ప్రకాష్ రెడ్డి వాదనలు వినిపించారు. హత్య జరిగిన ఏడాదిలోపే కేసును విచారించి కోర్టులో చార్జిషీటు దాఖలు చేసి తీర్పు కూడా వెలువరించడంపై న్యాయవాదులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కేసులో 90 రోజుల్లో విచారణ పూర్తి చేసి, చార్జ్‌షీట్ దాఖలు చేసిన కర్నూలు డీఎస్పీ విజయశేఖర్, నాలుగో పట్టణ సీఐ పి. శంకరయ్యను జిల్లా ఎస్పీ జి.కృష్ణకాంత్ అభినందించారు.

తాగునీటి సమస్య పరిష్కరించండి

- పింఛన్లు రావడం లేదని జనం తిడుతున్నారు
- జడ్పీటీసీల ఆందోళన ● ముగిసిన సర్వసభ్య సమావేశం

కర్నూలు(న్యూసిటీ), ఫిబ్రవరి 21: ఉమ్మడి జిల్లాలోని కొన్ని గ్రామాలలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని, ముఖ్యంగా పశ్చిమ ప్రాంతంలోని కొన్ని మండలాల్లో తాగునీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని జడ్పీటీసీలు ఆందోళన వ్యక్తం చేశారు. జిల్లా పరిషత్ సర్వసభ్యసమావేశం జిల్లా పరిషత్ సమావేశ భవనంలో బుధవారం జడ్పీ ఛైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి రాష్ట్ర ఆర్థిక మంత్రి, ఇన్‌చార్జి మంత్రి బుగ్గన రాజేంద్రనాథరెడ్డి, కర్నూలు, నంద్యాల కలెక్టర్లు డా.జి. సృజన, కే. శ్రీనివాసులు, జిల్లా పరిషత్ సీఈఓ జి. నాసర రెడ్డి, కర్నూలు ఎంపీ డా. సంజీవ్‌కుమార్, ఎమ్మెల్సీ మధుసూదన్ పాల్గొన్నారు. ఉమ్మడి జిల్లాలకు సంబంధించి అజెండాలో ఉన్న శాఖలు గ్రామీణ నీటి సరఫరా విభాగం, జిల్లా గ్రామీణాభివృద్ధి, జిల్లా పరిషత్ బడ్జెట్‌పై చర్చించారు. మిగతా శాఖలపై ఎటువంటి చర్చ జరగలేదు.

● మద్దికెర, జుపాడుబంగ్లా, ఓర్వకల్లు, కొత్తపల్లి, ఆత్మకూరు, వెల్దుర్తి, గూడూరు, ఆస్పరి, చిప్పగిరి, సీ. బెళగల్ మండలాల్లో తీవ్ర నీటి ఎద్దడి ఉందని, రాబోయే వేసవికాలాన్ని దృష్టిలో ఉంచుకుని సమస్యను పరిష్కరించాలని జడ్పీటీసీలు మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. వెల్దుర్తి మండల కేంద్రంలో వైఎస్‌ఆర్ సుజల స్రవంతి మూసివేడయంతో నీటి సరఫరాకు తీవ్ర అంతరాయం కలిగిందని జడ్పీటీసీ సుంకన్న తెలిపారు. గూడూరు మండలం చనుగొండ్ల గ్రామంలోని తన ఇంట్లోనే నీటి సమస్య ఉందని ఎంపీపీ సునీత అన్నారు. కొత్తపల్లి మండలం ఎర్రమఠం, గువ్వలకుంటలో భూగర్భజలాలు పూర్తిగా ఎండిపోవడంతో నీటి సమస్య తీవ్రంగా ఉందని జడ్పీటీసీ సుధాకర్‌రెడ్డి అన్నారు. ఆత్మకూరు మండలం కరివేన, కురుకుంద గ్రామాలలో సమస్య ఉందని జడ్పీటీసీ శంకర్‌రెడ్డి, ఓర్వకల్లు మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో నీటి వసతి కొరత ఉందని తక్షణమే బోర్లు వేయాలని జడ్పీటీసీ రంగనాథగౌడు, మిడ్తూరు మండలంలోని 24 గ్రామాలలో నీటి సమస్య ఉండటంతో ట్యాంకర్లతో నీటి సరఫరా చేస్తున్నారని జడ్పీటీసీ యుగంధర్‌రెడ్డి, జుపాడుబంగ్లా మండల కేంద్రంలోని నీటి ట్యాంకులను శుభ్రం చేయకపోవడంతో నుసి పురుగులు వస్తున్నాయని.. ఈఓఆర్‌డీ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈలు అస్సలు స్పందించడం లేదని జడ్పీటీసీ పోచా జగదీశ్వరరెడ్డి కోరారు. ఆస్పరిలో, చిప్పగిరిలో నీటి సమస్యను పరిష్కరించాలని జడ్పీటీసీలు కోరారు.

● బడ్జెట్‌పై ప్రశ్నించిన మంత్రి...
తెల్లమొహం వేసి సీఈఓ

సమావేశంలో జిల్లా పరిషత్ 2023-24వ ఆర్థిక సంవత్సర సవరణ బడ్జెట్, 2024-2-25 ఆర్థిక సంవత్సర అంచనాల బడ్జెట్‌లో జిల్లా పరిషత్ సీఈఓ వెంకటసుబ్బారెడ్డి వివరించారు. ఇటీవల స్థాయిసంఘాల సమావేశంలో ఆమోదం తెలిపిన బడ్జెట్‌ను సర్వసభ్యసమావేశంలో కూడ ఆమోదం కోసం తీసుకువచ్చినట్లు ఆయన తెలిపారు. ఈ క్రమంలో సీనరేజ్ గ్రాంట్ 25023-24 ఎంత చూపించారు, ఇసుక సెస్ వస్తుందా లేదా అని జడ్పీ సీఈఓని ఆయన ప్రశ్నించారు.


మాట్లాడుతున్న మంత్రి బుగ్గన

● ఉమ్మడి జిల్లా అభివృద్ధికి సహకరించండి

రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న పథకాలు అన్ని వర్గాలకు అందేలా చర్యలు తీసుకోవాలి. తాగునీటి సమస్యపై అధికారులు తగిన చర్యలు తీసుకోవాలి. జలజీవన్ మిషన్ కింద కర్నూలు జిల్లాకు రూ.530, నంద్యాల జిల్లాకు రూ.300 కోట్లు ఉన్నాయి. కోడుమూరు ప్రజల దాహార్తిని తీర్చేందుకు గాజులదిన్నె డ్యాంలో 2 టీఎంసీ నీటి నిల్వలు ఉంచాం.

- యర్రబోతుల పాపిరెడ్డి, జడ్పీ ఛైర్మన్

● **ఇదీ హాజరు:** జిల్లా పరిషత్ సర్వసభ్యసమావేశానికి ఒక మంత్రి, ఒక ఎంపీ, ఒక ఎమ్మెల్యే, ఒక ఎమ్మెల్సీ మాత్రమే హాజరయ్యారు. ఈ సమావేశంలో జడ్పీ డిప్యూటీ వెంకటసుబ్బారెడ్డి, వైస్ ఛైర్మన్లు దిల్షాద్‌నాయక్, కురువ బుజ్జమ్మ, కో ఆప్టెడ్ సభ్యులు సయ్యద్ అస్లాం ఖాద్రి, సయ్యద్ సులేమాన్, జడ్పీటీసీ, ఎంపీపీలు పాల్గొన్నారు.

పాఠశాలలు, హాస్టళ్లకు తాగునీరు అందివ్వండి ...

జిల్లాలోని పాఠశాల, హాస్టళ్లలో తాగునీటి సమస్య రాకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలి. గ్రామాల్లోని ఓహెచ్‌ఆర్ ట్యాంకుల నిర్వాహణ ప్రతి ఆరు నెలలకు ఒక్కసారి చూసుకోవాలి. చిన్న చిన్న మరమ్మతులు ఉంటే చేసుకోవాలి.

బుగ్గన రాజేంద్రనాథరెడ్డి,
రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి, ఇన్‌చార్జి మంత్రి

భర్తే కడతేర్చాడు

మద్యానికి బానిసై భార్యను హతమార్చిన వైనం


జయలక్ష్మి (ఫైల్)

పెద్దకడుబూరు, ఫిబ్రవరి 21: జీవితాంతం తోడుగా ఉండాల్సిన భర్తే భార్య పాలిట కాలయముడయ్యాడు. మద్యానికి బానిసై భార్యను హత మార్చాడు. ఈ ఘటన మండల పరిధిలోని గంగులపాడు గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. కోసిగి మండలం సజ్జల గూడెం గ్రామానికి చెందిన జయలక్ష్మిని పెద్దకడబూరు మండలం గంగులపాడు గ్రామానికి చెందిన నాగేష్‌కు 15 ఏళ్ల క్రితం ఇచ్చి పెళ్లి చేశారు. వీరికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. వీరు కూలి పనులు చేసుకొని జీవనం సాగించేవారు. కూలి పనుల కోసం హైదరాబాద్ వెళ్లారు. అక్కడ భవన నిర్మాణ పనులు చేస్తుండగా గోడ కూలి నాగేష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో వీరు తిరిగి స్వగ్రామానికి చేరుకొని కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో గ్రామంలో సొంతంగా ఇంటి నిర్మాణాన్ని చేపట్టారు. అయితే భర్త నాగేష్ మద్యానికి బానిసై ఇంటి నిర్మాణ పనుల్లో పాల్గొనక పోగా మద్యం మత్తులో భార్య జయలక్ష్మిని చిత్రహింసలకు గురి చేసేవాడు. మంగళవారం రాత్రి సైతం మద్యం తాగి రావటంతో భార్య నిలదీసింది. దీంతో ఇరువురి మధ్య వాదోపవాదాలు జరిగాయి. ఆ తరువాత నాగేష్‌తోపాటు అందరూ భోజనం చేసి పడుకున్నారు. అయితే బుధవారం ఉదయం నాగేష్ తల్లి పిల్లలను నిద్ర లేపేందుకు తలుపు తెరిచి చూడగా రక్తపు మడుగులో కోడలు జయలక్ష్మి(34) విగతజీవిగా పడి ఉండటాన్ని చూసి గట్టిగా కేకలు వేసింది. నిద్రమత్తులో ఉన్న భార్య జయలక్ష్మిని భర్త నాగేష్ ఇంట్లో ఉన్న గొడ్డలితో మెడపై కర్కషంగా నరికి చంపినట్లు గుర్తించారు. సమాచారం అందుకున్న సీఐ ప్రసాద్, పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని జయలక్ష్మి మృతదేహాన్ని పరిశీలించారు. వివరాలు తెలుసుకొని పోస్టుమార్టం నిమిత్తం ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. జయలక్ష్మి తండ్రి ఎల్లయ్య ఫిర్యాదు మేరకు పెద్దకడుబూరు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. ము గ్గురు పిల్లలు తల్లి మృతదేహం దగ్గర రోదించటం చూపరులను కన్నీరు పెట్టించింది.

హంద్రీలో పడి వ్యక్తి మృతి

దేవనకొండ, ఫిబ్రవరి 21 : గుండ్లకొండ హంద్రీ నీవా కాలువ వద్ద స్నానం చేస్తుండగా ప్రమాదవశాత్తు అదుపు తప్పి కాలువలో పడి కర్నూలుక చెందిన జశ్వంత్ (24) మృతి చెందాడు. మండలంలోని గుండ్లకొండ గ్రామంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠకు కర్నూలు నుండి బ్రహ్మణులు పూజలు నిర్వహించేందుకు వచ్చారు. వారిలో జశ్వంత్ వచ్చాడు. ఆయన తనతో పాటు మరొకరిని తోడుగా తీసుకొని హంద్రీ కాలువకు స్నానానికి వెళ్లాడు. లోతుగా వున్న ప్రాంతంలో అదుపు తప్పడంతో ఈత రాక జశ్వంత్ కాలువలో కొట్టుకుపోయాడు. పోలీసులు ఈతగాళ్లతో కాలువలో వెతికించి, జశ్వంత్ మృతదేహాన్ని వెలికితీశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బాలుడి బలవన్మరణం

వెల్దుర్తి, ఫిబ్రవరి 21: చెట్టుకు ఉరివేసుకొని పదమూడేళ్ళ బాలుడు బలవన్మరణానికి గురయ్యాడు. ఈ ఘటన మండలంలో జరిగింది. మండలంలోని ఓ గ్రామంలో బుధవారం ఉదయం మామిడితోటలోని చెట్టు కొమ్మకు వేలాడుతూ ఉన్న మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. వారు సంఘటన స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వెల్దుర్తి సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. ఎస్‌ఐ చంద్రశేఖర్ రెడ్డి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

ఎన్నికల సంఘం మార్గదర్శకాలు పాటించండి

- ఎన్నికల వ్యయ పర్యవేక్షణ నోడల్ అధికారి కె.రమేష్‌బాబు

కర్నూలు(కలెక్టరేట్), ఫిబ్రవరి 21: పార్లమెంటు, శాసనసభల ఎన్నికల నేపథ్యంలో పోటీ చేస్తున్న అభ్యర్థుల ఖర్చుల నివేదికలు భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాలు ప్రకారం పకడ్బందీగా సిద్ధం చేయాలని జిల్లా నోడల్ అధికారి కె.రమేష్ బాబు, ఎస్.రామాంజనేయులు సూచించారు. బుధవారం కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా పరిశ్రమల కేంద్రం సమావేశ భవనంలో ఎన్నికల వ్యయం గురించి అసిస్టెంట్ ఎక్స్‌పెండీచర్ అబ్జర్వర్, అకౌంటింగ్ టీములకు శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఆడిట్ అధికారి ఎన్నికల వ్యయ పర్యవేక్షణ నోడల్ అధికారి కె. రమేష్‌బాబు పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా ఎన్నికల ఖర్చుల రకాలు, ఫ్లైయింగ్ స్క్వాడ్, స్టాటిక్ సర్వెలెన్స్, వీడియో వ్యూయింగ్, ఎక్సైజ్, అకౌంటింగ్, ఎంసీఎంసీ బృందాలు నిర్వహించాల్సిన విధులను అసిస్టెంట్ ఎక్స్‌పెండీచర్ అబ్జర్వర్, అకౌంటింగ్ టీములకు వివరించారు. ఒక్కో పార్లమెంటు నియోజకవర్గానికి పోటీ చేస్తున్న అభ్యర్థి రూ.95 లక్షలు, శాసనసభ నియోజకవర్గానికి పోటీ చేసే అభ్యర్థి రూ.40లక్షలు వరకు ఖర్చు చేసేందుకు అనుమతి ఉందన్నారు. అంతకుమించి ఖర్చు చేస్తే వారు పోటీ చేసే అర్హత కోల్పోతారన్నారు. రూ.10 లక్షలకు మించి ఎక్కడైనా నగదు పట్టుకుంటే ఆదాయపు పన్ను అధికారులకు తెలియజేసి సీజ్ చేయించాలన్నారు. స్టార్ క్యాంపెయినర్ వద్ద రూ.1 లక్ష వరకు ఉంచుకునేందుకు అనుమతి ఉందన్నారు. వ్యయ నోడల్ అధికారి రామాంజనేయులు మాట్లాడుతూ ఎవరైనా సరే రూ.50వేలకు మించి నగదు తీసుకెళ్తుంటే పట్టుకోవాలని, రూ.10వేలు విలువ చేసే బహుమతులు, వస్తువులు ఉంటే సీజ్ చేయాలని అన్నారు. అభ్యర్థులు తమ ఖర్చుల నివేదికలను మూడుసార్లు వ్యయ పరిశీలకులకు చూపించాల్సి ఉంటుందన్నారు. ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులు ఎలక్ట్రానిక్ మీడియాలో ప్రచార ప్రకటనల కోసం తప్పనిసరిగా మీడియా సర్టిఫికేషన్ మానిటరింగ్ కమిటీ (ఎంసీఎంసీ) వద్ద ముందస్తుగా అనుమతి పొందాల్సి ఉంటుందన్నారు. చె ల్లింపు వార్తలను గుర్తించి అభ్యర్థుల ఖాతాలో ఖర్చు కింద జమ చేయాల్సి ఉంటుందన్నారు.

ఆటో డ్రైవర్లపై స్పెషల్ డ్రైవ్

కర్నూలు(లీగల్), ఫిబ్రవరి 21: ఆటో డ్రైవర్లకు ఎదురవుతున్న సమ స్యలపై అవగాహన కల్పించేందుకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ బుధవా రం స్థానిక లోక్ అదాలత్ భవనంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించింది. డ్రైవర్లు ఆటోల రిజిస్ట్రేషన్, ఇన్సూరెన్స్, డ్రైవింగ్ లైసెన్సుల విషయంలో ఎదురవుతున్న సమస్యలను విచారించి తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సీహెచ్ వెంకట నాగ శ్రీనివాస రావు వారికి అవగాహన కల్పించారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ డ్రైవింగ్ లైసెన్సు, రిజిస్ట్రేషన్, ఇన్సూరెన్స్ కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో శాశ్వత లోక్ అదాలత్ అధ్యక్షుడు ఎం.వెంకట హరినాథ్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

ఓర్వకల్లు, ఫిబ్రవరి 21: మండలంలోని కర్నూలు-చిత్తూరు జాతీయ రహదారి-40పై నన్నూరు గ్రామ సమీపాన ఈశ్వర్ గోడౌన్ వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఫక్కీర్‌సాబ్ (35) అనే వ్యక్తి దుర్మరణం చెందాడు. కల్లూరు మండలం తడకనపల్లె గ్రామానికి చెందిన ఫక్కీర్‌సాబ్ తడకనపల్లె నుంచి బనగానపల్లెకు ద్విచక్రవాహనంపై వెళ్తూ.. నన్నూరు వద్ద ముందు వైపు వెళ్తున్న ఈశ్వర్ అనే వ్యక్తి ద్విచక్రవాహనాన్ని వెనుక వైపు నుంచి ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో ఫక్కీర్‌సాబ్ తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. వాహనం వెనుక అతని భార్యకు స్వల్ప గాయాలయ్యాయి. ఓర్వకల్లు పొగాకు కంపెనీలో పని చేస్తున్న ఈశ్వర్‌కు తీవ్ర గాయాలు కావడంతో కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రాజారెడ్డి తెలిపారు.

ఓటమి భయంతోనే దాడులు



- టీడీపీ జిల్లా అధ్యక్షుడు బీటీ నాయుడు

కర్నూలు(అర్బన్), ఫిబ్రవరి 21: ఓటమి ఖాయమని తెలిసి సీఎం జగన్మోహన్‌రెడ్డి మీడియా పై వైసీపీ గుండాలను దాడులకు ప్రోత్సహిస్తున్నారని ఎమ్మెల్సీ, టీడీపీ జిల్లా అధ్యక్షుడు బీటీ నాయుడు అన్నారు. బుధవారం జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మీడియా అన్నా, ప్రశ్నించే ప్రతిపక్షాలన్నా సీఎం జగన్ భయాందోళనలకు గురవుతున్నారని అన్నారు. దాంతోనే తన పార్టీ నాయకులను, కార్యకర్తలను, గుండాలను దాడులకు ప్రోత్సహిస్తున్నారని మండిపడ్డారు. నగరంలోని ఈనాడు కార్యాలయంపై వైసీపీ దాడులను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. తుని ఆంధ్రజ్యోతి విలేఖరి హత్య, పోలవరం ప్రజాశక్తి విలేకరిపై వైసీపీ రౌడీ మూలక దాడి, అమరావతిలో పరమేశ్వర రావు, రాప్తాడులో శ్రీకృష్ణ, మద్దికెరలో వీరశేఖర్‌పై దాడి, కర్నూలులో ఏకంగా ఈనాడు కార్యాలయంపై వైసీపీ మూకల దాడి ఇదంతా అందులో భాగమే అన్నారు. జగన్‌రెడ్డి పాలనలోని అవినీతి, అక్రమాలు, అరాచకాలను ఇంత వరకు ఓర్పుతో భరించిన ప్రజలు ఇప్పుడు తిరగబడుతున్నారని అన్నారు. వైసీపీ నాయకుల అక్రమాలను బయట పెడుతున్న మీడియా మీద దాడులకు దిగడం ఎంత వరకు సమంజమని ప్రశ్నించారు. ఎన్ని దాడులు చేయించినా వాస్తవాలను దాచలేరని, వైసీపీ చేసినదానికి రాబోయే రోజుల్లో ప్రతిఫలం అనుభవించాల్సి ఉంటుందని అన్నారు.

రోళ్లపెంట ఘాట్‌లో రెండు లారీలు ఢీ

- రక్షణ గోడను తగిలి రోడ్డుపై అడ్డంగా నిలిచిన లారీ, మరో లారీ బోల్తా
- నాలుగు గంటల పాటు నల్లమలలో ట్రాఫిక్ జామ్


నల్లమలలోని రోళ్లపెంట ఘాట్‌పై ఢీకొన్న లారీలు

ఆత్మకూరు, ఫిబ్రవరి 21: నల్లమలలోని రోళ్లపెంట ఘాట్‌లో బుధవారం ప్రమాదవశాత్తు రెండు లారీలు ఢీకొన్నాయి. దీంతో నల్లమలలోని కర్నూలు-గుంటూరు జాతీయ రహదారిపై సుమారు నాలుగు గంటలపాటు ట్రాఫిక్ స్తంభించిపోయింది. బుధవారం ఉదయం 7గంటల సమయంలో గుంటూరు నుంచి ఆత్మకూరు వైపు వరి ధాన్యం లోడ్‌తో వస్తున్న లారీ రోళ్లపెంట ఘాట్ దిగే క్రమంలో రెండో మలుపు వద్ద బ్రేక్ ఫెయిల్ అయింది. దీంతో అదుపుతప్పి ఎదురుగా వస్తున్న మరో లారీని ఢీకొట్టి బోల్తా పడింది. ఎదురుగా వచ్చిన లారీ ఘాట్ రోడ్డు రక్షణ గోడకు తగిలి రోడ్డుకు అడ్డంగా నిలిచిపోయింది. దీంతో కనీసం బైక్ కూడా రోడ్డు దాటేందుకు వీలు లేకపోవడంతో కర్నూలు-గుంటూరు జాతీయ రహదారిపై వాహనాల రాకపోకలకు అంతరాయం నెలకొంది. ఆత్మకూరు ఎస్సై నారాయణరెడ్డి తమ సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకొని, ఎక్స్‌కవేటర్ సాయంతో రక్షణ గోడను తగిలి రోడ్డుకు అడ్డంగా నిలిచిన లారీని పక్కకు తప్పించారు. మరో లారీలో ఉన్న వరిధాన్యాన్ని ఇంకో వాహనంలోకి తరలించి ఖాళీ లారీని పక్కకు జరిపించరు. ఉదయం 11గంటలకు రెండు లారీలను రోడ్డుపై నుంచి పక్కకు తప్పించడంతో వాహనాల రాకపోకలు మొదలయ్యాయి.

చెట్టును ఢీకొన్న కారు

- రాచర్ల ఎస్‌ఐ దుర్మరణం
- డ్రైవర్, అల్లుడు కూడా మృతి
- మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్ వద్ద ఘటన


చెట్టును ఢీకొని నుజ్జునుజ్జయిన కారు


పవన్‌సాయి (ఫైల్)
కారులో ఇరుక్కొని దుర్మరణం చెందిన ఎస్‌ఐ వెంకటరమణ


ఎస్‌ఐ వెంకటరమణ (ఫైల్)

ప్యాపిలి, ఫిబ్రవరి 21 : మహబూబ్ నగర్ జిల్లాలో జరిగిన ఓ రోడ్డు ప్రమాదంలో ప్యాపిలి మండలంలోని రాచెర్ల ఎస్‌ఐ నంబూరి వెంకటరమణ దుర్మరణం పాలయ్యాడు. అతివేగంగా వెళుతూ అదుపు తప్పిన కారు చెట్టును ఢీకొన్న సంఘటనలో ఎస్‌ఐతో పాటు మరో ఇద్దరు అక్కడికక్కడే దుర్మరణం చెందారు. ఈ సంఘటన బుధవారం మహబూబ్‌నగర్ జిల్లా భూత్పూర్ మండలంలోని 44వ నెంబర్ జాతీయ రహదారిపై చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. అనంతపురం జిల్లాకు చెందిన నంబూరి వెంకటరమణ రాచర్ల ఎస్‌ఐగా విధులు నిర్వహిస్తున్నాడు. అయితే ఈయన కుమార్తె అనూషను హైదరాబాద్‌లోని మనికొండకు చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజనీరుగా పని చేస్తున్న పవన్‌సాయికి ఇచ్చి ఈ నెల 15వ తేదీన ఘనంగా వివాహం జరిపించారు. ఈ నెల 20వ తేదీన హైదరాబాద్‌లోని వరుడి ఇంటి దగ్గర నిర్వహించిన విందుకు ఎస్‌ఐ వెంకట రమణ కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లారు. తిరిగి బుధవారం ఉదయం హైదరాబాద్ నుంచి ఎస్‌ఐ వెంకటరమణ, అతని కూతురు అనూష, అల్లుడు పవన్‌సాయి, కారు డ్రైవర్ చంద్ర కలిసి కారులో తిరిగి అనంతపురానికి బయలుదేరారు. భూత్పూర్ మండలంలోని అన్నసాగర్ గ్రామం సమీపంలోకి రాగానే వీరు ప్రయాణిస్తున్న కారు అదుపుతప్పి చెట్టును ఢీకొంది. ఈ సంఘటనలో ఎస్‌ఐ వెంకటరామణ (55), అల్లుడు పవన్ సాయి (25), కారు డ్రైవర్ చంద్ర (27) అక్కడికక్కడే దుర్మరణం చెందారు. కారులో ఉన్న కూతురు అనూషకు తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన అనూషను మహబూబ్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వివాహం జరిగిన వారం రోజులకే కాళ్లకు పారాణి ఆరకముందే నూతన వరుడు పవన్‌సాయి కానరాని లోకాలకు వెళ్లడంతో కుటుంబ సభ్యుల రోదనలు కంటతడి పెట్టించాయి. విషయం తెలుసుకున్న మహబూబ్‌నగర్ డీఎస్పీ వెంకటేశ్వర్లు, భూత్పూర్ సీఐ రామకృష్ణ, ఎస్‌ఐ శ్రీనివాసులు సంఘటనా స్థలానికి చేరుకొని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు. ఎస్‌ఐ వెంకటరమణ మృతితో ప్యాపిలి సీఐ సుధాకర్ రెడ్డి, రాచెర్ల, ప్యాపిలి, జలదుర్గం పోలీసులు సంతాపం వ్యక్తం చేశారు.

దగా డీఎస్సీని రద్దు చేయాలి

- 26న అనంతపురం నుంచి కాంగ్రెస్ ఎన్నికల శంఖారావం
- నంద్యాల డీసీసీ అధ్యక్షుడు జె. లక్ష్మీనరసింహ యాదవ్


మాట్లాడుతున్న లక్ష్మీనరసింహ యాదవ్

నంద్యాల టౌన్, ఫిబ్రవరి 21: వైసీపీ ప్రభుత్వం విడుదల చేసిన దగా డీఎస్సీని రద్దు చేసి, మెగా డీఎస్సీని విడుదల చేయాలని నంద్యాల డీసీసీ అధ్యక్షుడు జె. లక్ష్మీనరసింహ యాదవ్ డిమాండ్ చేశారు. బుధవారం డీసీసీ కార్యాలయం రాజీవ్ భవన్‌లో జిల్లా కాంగ్రెస్ ముఖ్య నాయకుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నరసింహ యాదవ్ మాట్లాడుతూ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు జగన్ నిరుద్యోగులకు హామీ ఇస్తూ అధికారంలోకి వస్తే ప్రతి ఏటా డీఎస్సీ ద్వారా 25 వేల టీచర్ పోస్టులను భర్తీ చేస్తానని చెప్పి అధికారంలోకి వచ్చి పదవీ కాలం ముగుస్తున్నా హామీని నెరవేర్చలేదని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలోని నిరుద్యోగులందరూ జగన్‌ను ఓడించి గద్దె దింపడానికి సిద్ధంగా ఉన్నారని అన్నారు. మెగా డీఎస్సీ ద్వారా 30 వేల టీచర్ పోస్టులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈనెల 26వ తేదీన అనంతపురంలో కాంగ్రెస్ నేతృత్వంలో భారీ బహిరంగ సభ నిర్వహించి ఎన్నికల శంఖారావాన్ని పూరించబోతున్నట్లు వెల్లడించారు. అనంతపురంలో జరిగే ఎన్నికల శంఖారావానికి ఏఐసీసీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలారెడ్డి, సీడబ్ల్యూసీ సభ్యుడు డాక్టర్ ఎన్ రఘువీరారెడ్డి, గిడుగు రుద్రరాజు, తదితరులు ముఖ్య నాయకులు హాజరవుతున్నారని తెలిపారు.

మీడియా స్వేచ్ఛను హరించే నాయకులపై చర్యలు తీసుకోవాలి:

మీడియా స్వేచ్ఛను హరించే నాయకులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని జె. లక్ష్మీనరసింహ యాదవ్ డిమాండ్ చేశారు. రాప్తాడు సిద్ధం సభలో ఫొటో గ్రాఫర్ కృష్ణపై దాడి జరిగిన ఘటన మరువకముందే, కర్నూలులో ఈనాడు కార్యాలయంపై వైసీపీ గుండాల దాడి, మద్దికేర ఆంధ్రజ్యోతి విలేఖరిపై వైసీపీ మూకల దాడి దుర్మార్గమని అన్నారు. సమావేశంలో పీసీసీ ప్రధాన కార్యదర్శి చింతల మోహన్‌రావు, రాష్ట్ర అధికార ప్రతినిధి ఊకొట్టు వాసు, పట్టణ అధ్యక్షుడు దాసరి చింతలయ్య, కోఆర్డినేషన్ సభ్యుడు ఫరూక్ పాల్గొన్నారు.

అనుమానాస్పదంగా గర్భిణి మృతి

- భర్త, అత్త, మామలపై కేసు నమోదు
- కలెక్టరేట్ ఎదుట మృతురాలి బంధువుల ఆందోళన
- పోలీసుల దాడి, పరిస్థితి ఉద్రిక్తం

కర్నూలు, ఫిబ్రవరి 21: నగరంలో మూడో పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో రామప్రియనగర్‌కు చెందిన మెగావత్ శిరీష (25) అనుమానాస్పద స్థితిలో ఆత్మహత్య చేసుకుంది. బుధవారం తెల్లవారుజామున ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుందని, భర్త, బంధువులు ఆసుపత్రికి తీసుకువచ్చారు. అప్పటికే ఆమె మృతి చెందిందని వైద్యులు తెలిపారు. శిరీష బంధువులు కర్నూలుకు చేరుకుని తమ కూతురు ఆత్మహత్య చేసుకోలేదని, అత్త, మామ, భర్త, మరిది కలిసి హత్య చేశారని ఆరోపించారు. ఆత్మకూరు మండలం సంజీవనగర్ తండాకు చెందిన శిరీషకు కర్నూలుకు చెందిన ఏఎస్‌ఐ తిరుపాలు నాయక్ కొడుకు శ్రీకాంత్ నాయక్‌తో 9 నెలల కింద పెళ్లయింది. శ్రీకాంత్ నాయక్ రైల్వేలో వీసీగా పని చేస్తున్నాడు. 7 నెలల గర్భిణి అయిన శిరీష అనుమానాస్పద స్థితిలో మృతి చెందడంతో బంధువులు ఆందోళన వ్యక్తం చేశారు. పెళ్లయినప్పటి నుంచి శిరీష భర్త, అత్త రుక్మిణిబాయి, మామ తిరుపాల్‌నాయక్, మరిది పురేంద్రనాయక్ ఆమెను మానసికంగా, శారీరకంగా వేధిస్తున్నారనీ, అదనపు కట్నం కోసం డిమాండ్ చేస్తున్నారని తల్లిదండ్రులు ఆరోపించారు. పోలీసులు శిరీష మృతదేహాన్ని మార్చురీకి తరలించి పోస్టుమార్టం నిర్వహించారు.

● మృతదేహం అప్పగింతపై ఉద్రిక్తత:

శిరీష మృతదేహానికి పోస్టుమార్టం పూర్తయిన తర్వాత మృతదేహాన్ని తీసుకెళ్లడం, అంత్యక్రియల నిర్వహణపై ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. తమ సంప్రదాయం ప్రకారం అత్త మామలే అంత్యక్రియలు చేయాలని మృతురాలి బంధువులు, తల్లిదండ్రులు పట్టుబట్టారు. సుమారు 50 మందికి పైగా ఆమె బంధువులు మార్చురి వద్దకు చేరుకుని ఆందోళన చేశారు. అయితే.. మృతురాలి భర్త, అత్తమామలు ఎవరూఆ వైపు రాలేదు. పోలీసులు మాత్రం ఆమె మృతదేహాన్ని తీసుకెళ్లాలని పట్టుబట్టారు. దీంతో ఆమె బంధువులు గాంధీ విగ్రహం ముందు ధర్నా నిర్వహించారు. ఈ ధర్నా కాస్త రాస్తారోకోగా మారడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. సీఐలు మురళీధర్ రెడ్డి, ఇంతియాజ్‌ల ఆధ్వర్యంలో ఆందోళన చేస్తున్న బంధువులను పోలీసులు జీపు ఎక్కించే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో పోలీసులకు, మృతురాలి బంధువుల మధ్య వాగ్వాదం నెలకొంది. కొంత మంది పోలీసులు మృతురాలి బంధువులపై విచక్షణారహితంగా దాడి చేశారు. బూటుకాళ్లతో కింద పడేసి కొట్టడం వివాదాస్పదంగా మారింది. తమకు న్యాయం చేయాలని కోరితే.. తమపైనే పోలీసులు దాడులు చేయడం ఎంత వరకు సమంజసమని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. శిరీష మామ తిరుపాల్ నాయక్ ఏఎస్‌ఐ కావడంతో పోలీసులు పక్షపాత ధోరణి వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. మృతదేహం మాత్రం బుధవారం రాత్రి వరకు మార్చురీలో ఉండిపోయింది. శిరీష బంధువుల ఫిర్యాదు మేరకు తిరుపాల్ నాయక్, ఆయన భార్య రుక్మిణిబాయి, కొడుకులు శ్రీకాంత్ నాయక్, పురేంద్ర నాయక్‌లపై కేసు నమోదు చేశామని సీఐ మురళీధర్ రెడ్డి తెలిపారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి

దేవనకొండ, ఫిబ్రవరి 21: పొలంలోని ట్రాన్స్‌ఫార్మర్ వద్ద చెలరేగిన మంటలను ఆర్పే క్రమంలో విద్యుత్ తీగను పట్టుకొని బేతపల్లి గ్రామానికి చెం దిన రైతు సురేంద్ర(30) విద్యుదాఘాతానికి గురై అక్కడిక్కడే మృతి చెందాడు. మృతుడు తనకున్న పొలంలో మిరప, వేరుశనగ సాగు చేస్తున్నాడు. నీరులేక పం టలు ఎండిపోతుండటంతో కొత్తగా బోరు వేసి ట్రాన్స్‌ఫార్మర్ పనులు చేస్తుండగా ప్రమాదం జరిగింది. గ్రామంలోని 3వ వార్డు సభ్యుడిగా టీడీపీ మద్దతుతో సురేంద్ర గెలిచారు. మృతునికి భార్య మంజుల, ఇద్దరు కుమారులు ఉన్నారు. సురేంద్ర మృతికి టీడీపీ మండల కన్వీనర్ విజయభాస్కర్ గౌడ్, సీపీఐ మండల కార్యదర్శి నర్సారావు నివాళి ప్రకటించారు. ప్రభుత్వం సురేంద్ర కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు.

స్టైఫండ్ కోసం జూనియర్ డాక్టర్ల ఆందోళన

- గేట్లకు తాళం.. అక్కడే బైఠాయింపు



కర్నూలు(హాస్పిటల్), ఫిబ్రవరి 21: గత ఐదు నెలలుగా పెండింగ్‌లో ఉన్న స్టైఫండ్స్‌ను చెల్లించాలని కోరుతూ బుధవారం కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ కార్యాలయం ఎదుట జూనియర్ డాక్టర్లు ఆందోళన నిర్వహించారు. దాదాపు 188 మంది హౌస్ సర్జన్లు సూపరింటెండెంట్ చాంబర్ వద్దకు వెళ్లేందుకు ప్రయత్నించగా సెక్యూరిటీ సిబ్బంది గేట్లను మూసివేశారు. దీంతో గేట్ల ఎదుట హౌస్ సర్జన్లు బైఠాయించి ఆందోళన చేశారు. హౌస్ సర్జన్ల అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు మెర్సి, నిఖిల్ నాయకులు ప్రీతి, తేజస్, అఖిల్ మాట్లాడుతూ గత 5 నెలలుగా ప్రభుత్వం ఉపకార వేతనాలు చెల్లించడం లేదని, దాదాపు 2.10 కోట్ల బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నెల 29న హౌస్ సర్జన్లు కోర్సు పూర్తవుతుందని 8 రోజుల్లో బకాయిలు ఇవ్వాలని కోరారు.

'ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తా...'

స్టైఫండ్ బకాయిలు గురించి ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వి.వెంకటరంగారెడ్డి ఆందోళన చేస్తున్న హౌస్‌సర్జన్ల దగ్గరకు వెళ్లి ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు.

ఓంకారంలో దుకాణాలకు వేలం



వేలం నిర్వహిస్తున్న అధికారులు

బండిఆత్మకూరు, ఫిబ్రవరి 21: నల్లమల అటవీ ప్రాంతంలో వెలసిన ఓంకార క్షేత్రంలో వివిధ రకాల అమ్మకాలకు బుధవారం బహిరంగ వేలం పాటలు నిర్వహించారు. బుధవారం మూడోసారి వేలం పాటలు చైర్మన్ విశ్వనాథరెడ్డి, పాలక మండలి సభ్యుల సమక్షంలో వేలం పాటలు నిర్వహించారు. టెంకాయల అమ్మకానికి గత ఏడాది రూ.7,08,000 రాగా, ఈ ఏడాది రూ.6,12,000 లభించింది. అలాగే ఐసు బండ్ల నిర్వహణకు గతంలో రూ.29 వేలు, ప్రస్తుతం రూ.29,500 వచ్చింది. పాదరక్షలు భద్రపరిచేందుకు గతంలో రూ.1,36,000 రాగా, ప్రస్తుతం రూ.80 వేలు వచ్చింది. కూల్‌డ్రింక్స్ అమ్మకాల హక్కుకు వేలం ద్వారా గతంలో రూ.2,11,000 రాగా ప్రస్తుతం రూ.2,30,000 వచ్చింది. దీంతో సుమారు రూ.1.52లక్షల మేర రాబడి తగ్గిపోయిందని పరిశీలకుడు జనార్దన్, ఆలయ ఈవో ఎ.నాగప్రసాద్ తెలిపారు.

రైతులకు భూములు చూపాలి: సీపీఎం



మిడ్తూరు తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

నందికొట్కూరు ఫిబ్రవరి 21: పట్టాదారు పాసు పుస్తకాలు ఇచ్చిన పేదలకు భూములు చూపాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులునాగేశ్వరరావు డిమాండ్ చేశారు. బుధవారం మిడ్తూరు తహసీల్దార్ తులసమ్మకు సీపీఎం మండల కార్యదర్శి ఓబులేష్ గ్రామస్తులతో కలిసి వినతిపత్రం ఇచ్చారు. నాగేశ్వరరావు మాట్లాడుతూ మిడ్తూరు మండల కేంద్రానికి చెందిన 40 కుటుంబాలకు 1996లో అలగనూరు పొలిమేరలో పట్టాదారు పాసుపుస్తకాలు ఇచ్చారని, వాటిపై సొసైటీ, బ్యాంకుల్లో పంట రుణాలు ఇచ్చారని తెలిపారు. విత్తనాలు, ఎరువులు ప్రభుత్వం సబ్సిడీ ద్వారా అందజేశారన్నారు. కాని ఇంత వరకు పట్టాదారు పాసుపుస్తకాలు ఇచ్చిన రైతులకు భూములు చూపకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తోందన్నారు. వీరికి ప్రత్యామ్నాయ భూములు ఇస్తామని జాయింట్ కలెక్టర్ చెప్పారని తహసీల్దార్ దృష్టికి తీసుకుళ్లారన్నారు. అనంతరం తహసీల్దార్ మాట్లాడుతూ వీటిపైన ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని చెప్పారు. గ్రామస్థులు సుజ్ఞానం, ఏసన్న, తిరుపాలు, లింగమ్మ, వెంకటరమణమ్మ, వెంకటస్వామి, శుభ రత్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

వివాదాస్పద స్థలంపై విచారణ



వివాదాస్పద స్థలంపై విచారిస్తున్న అధికారులు

ఆత్మకూరు, ఫిబ్రవరి 21: ఆత్మకూరు మండలంలోని కొట్టాలచెరువు గ్రామంలో ప్రధాన మంత్రి ఆదివాసి న్యాయ మహా అభియాన్ కార్యక్రమంలో భాగంగా రూ.2.30కోట్లతో నిర్మించనున్న వసతిగృహానికి సంబంధించి అవసరమయ్యే 50సెంట్ల స్థలసేకరణ వివాదాస్పదంగా మారింది. దీంతో బుధవారం తహసీల్దార్ కె.బాబు, ఎస్ఐ వెంకట నారాయణరెడ్డి గ్రామానికి చేరుకుని వివాదాస్పద స్థలంపై విచారణ చేపట్టారు. అయితే సదరు స్థలం కొంత మంది వ్యక్తులు నివసిస్తుండటంతో వాటిని తొలగించాలని అధికారులు సూచించారు. అయితే తమ వద్ద స్థలానికి సంబంధించిన డాక్యుమెంట్స్ ఉన్నాయని చెప్పడంతో అధికారులు వాటిని తీసుకురావాలని చెప్పారు. అయితే వారి ఒకరు ఓ ఇంటి పట్టా తీసుకురావడంతో విచారిస్తామని చెప్పారు.

'ఆర్టీసీ ఉద్యోగులకు నగదు ప్రోత్సాహకాలు'



మెగా చెక్కును అందజేస్తున్న అధికారులు

ఆత్మకూరు, ఫిబ్రవరి 21: ఆత్మకూరు ఆర్టీసీ డిపో పరిధిలో గత జనవరి నెలలో ఉత్తమంగా రాణించిన ఆర్టీసీ ఉద్యోగులకు బుధవారం ఆర్టీసీ ఉన్నతాధికారులు నగదు ప్రోత్సాహకాలను అందజేశారు. డిపో మేనేజర్ మహేంద్రుడు మాట్లాడుతూ.. జనవరి-2024 నెలకు సంబంధించి కడప జోన్ పరిధిలో 78ఓఆర్ సాధించి డిపోను ప్రథమ స్థానంలో నిలుపడమే కాకుండా 5.49 కేఎంపీఎల్‌తో ఇంధనాన్ని పొదుపు చేసి జిల్లాలోనే తమ డిపో కార్మికులు ప్రథమ స్థానంలో నిలిచినట్లు చెప్పారు. అందుకు గానూ కండక్టర్లు నాగన్న, జీఆర్ఎల్ రెడ్డి, జీవీ.స్వామి, మున్నజాబీ, ఎస్ఎన్ బాషా, రూపావాణి, జీఎస్ ప్రతాప్‌తో పాటు ఉత్తమ కేఎంపీఎల్ సాధించిన డ్రైవర్లు శివారెడ్డి, పీఆర్సీ రెడ్డి, ఎస్కే వలి, దర్గయ్య, మధుసూదన్, ఎంఎస్ నాయక్‌కు ప్రోత్సాహక బహుమతులతో పాటు ప్రశంసా పత్రాలను అందజేశారు.

'పెండింగ్ బిల్లులు చెల్లించాం'

కొత్తపల్లి, ఫిబ్రవరి 21: కొత్తపల్లి మండలంలోని గోకులం లబ్ధిదారులకు ఎన్ఆర్ఈజీఎస్ కింద పెండింగ్ బిల్లులు ఇదివరకే చెల్లించామని ఆత్మకూరు ఎన్ఆర్ఈజీఎస్ క్లస్టర్ ఏపీడీ అన్వరాబేగం తెలిపారు. బుధవారం కొత్తపల్లిలోని ఉపాధి కార్యాలయాన్ని క్వాలిటీ కంట్రోలర్లతో కలిసి తనిఖీ చేశారు. అనంతరం ఏపీడీ క్షేత్రస్థాయిలో గోకులం లబ్ధిదారులకు సంబంధించిన రికార్డులను పరిశీలించిన అనంతరం విలేకరులతో మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో కొత్తపల్లి మండలంలోని గోకులం పథకం కింద 116 మంది లబ్ధిదారులు పాడిపోషణ రైతులు గోకులం షెడ్లు నిర్మించుకున్నారని తెలిపారు. వీరికి గతంలోనే విడతల వారిగా ప్రభుత్వం నుంచి రావాల్సిన పెండింగ్ బిల్లులు చెల్లించామన్నారు. అయితే ఇందులో 12 మంది లబ్ధిదారులు, ఇంకా పెండింగ్ బిల్లులు రావాల్సి ఉందని పీడీకి ఫిర్యాదు చేశారని తెలిపారు. పీడీ ఆదేశాల మేరకు ఎన్ఆర్ఈజీఎస్ సీనియర్, జూనియర్ క్వాలిటీ కంట్రోలర్స్ వెంకటేశ్, గంగాద్రిలతో కలిసి క్షేత్రస్థాయిలో గోకులం షెడ్లకు సంబంధించిన బిల్లులు పరిశీలిస్తే.. వారికి పెండింగ్ బిల్లులు రావాల్సిందేమీ లేదన్నారు. అయితే.. లబ్ధిదారులకు కాంట్రిబ్యూషన్ కింద కట్టుకున్న డబ్బులు మాత్రమే పశుసంవర్ధక శాఖ నుంచి రావాల్సి ఉందన్నారు. కొలతల్లో తేడా ఉంటే వారికి ఏదైనా చెల్లింపు చేయాల్సి ఉందన్నారు. కార్యక్రమంలో ఏపీవో రేష్మా, ఈసీ శ్రీనివాసులు, సిబ్బంది ఉన్నారు.

పత్రికా స్వేచ్ఛను హరిస్తున్న ప్రభుత్వం

విలేకరులు, కార్యాలయాలపై దాడులను ఖండించిన ప్రజా సంఘాలు

మహానంది, ఫిబ్రవరి 21: ప్రజాస్వామ్య బద్ధంగా వాస్తవాలను వెలుగులోకి తీసుకొస్తున్న పత్రికా విలేకరుల స్వేచ్ఛను వైసీపీ ప్రభుత్వం హరిస్తోందని ఏపీ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి టి.రామ చంద్రుడు అన్నారు. బుధవారం మహానంది మండలం గాజులపల్లిలో మాట్లాడారు. ఇటీవల జర్నలిస్టులపై వైసీపీ మూకల దాడులు ఎక్కువయ్యాయన్నారు. రాప్తాడులో సీఎం జగన్ సిద్ధం సభలో కవరేజ్ కోసం వెళ్లిన ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ కృష్ణపై దాడి ఘటన మరువక ముందే మంగళవారం కర్నూలులో ఈనాడు కార్యాలయంపై ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి వర్గీయులు దాడి చేయడం దారుణమన్నారు. అలాగే మద్దికెర మండల ఆంధ్రజ్యోతి విలేకరి వీరశేఖర్‌పై వైసీపీ మూకలు చొక్కా చింపి దాడి చేయడం దుర్మార్గమన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కోటకొండ బాషా, మద్దిలేటి, రమణ పాల్గొన్నారు.

బండిఆత్మకూరు: మీడియా ప్రతినిధులపై, కార్యాలయంపై దాడులకు పాల్పడిన వైసీపీ అల్లరి మూకలను వెంటనే అరెస్టు చేయాలని సీపీఎం మండల కార్యదర్శి రత్నమయ్య, వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు రామచంద్రుడు డిమాండ్ చేశారు. బుధవారం మండల పాత్రికేయులు, ప్రజా సంఘాలు తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. సాక్షాత్తు సీఎం సభలో రాప్తాడులో ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై వైసీపీ మూకలు చెలరేగిపోయి దాడులకు పాల్పడటం సిగ్గుచేటన్నారు. అలాగే మద్దికెరలో ఆంధ్రజ్యోతి విలేకరిపై దాడి, కర్నూలు ఈనాడు కార్యాలయంపై పాణ్యం ఎమ్మెల్యే అనుచరుల దాడి ఘటనలు ప్రజాస్వామ్య వ్యవస్థకే మాయని మచ్చ అని అన్నారు. అనంతరం తహసీల్దార్ సుమతికి వినతిపత్రం అందజేశారు. వివిధ పత్రికా, ఎలక్ట్రానిక్ మీడియా విలేకరులు, ప్రజా సంఘాల నాయకులు రాజు, డేవిడ్, సుబ్బరాయుడు పాల్గొన్నారు.



గడివేములలో ధర్నా చేస్తున్న పాత్రికేయులు, టీడీపీ నాయకులు

వెలుగోడు: జర్నలిస్టులపై దాడి చేసిన వారిని అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని ఏపీయూడబ్ల్యూజే జిల్లా కమిటీ సభ్యుడు రఘురాముడు యాదవ్, టీడీపీ నాయకులు హిదాయతుల్లా, సీపీఎం నాయకులు రాజశేఖర్, జనసేన నాయకులు శాలుబాషా, ఎస్డీపీఐ నాయకులు హుస్సేన్‌బాషా డిమాండ్ చేశారు. బుధవారం వెలుగోడు పట్టణంలో పొట్టి శ్రీరాములు సెంటర్‌లో మానవహారంగా ఏర్పడి నిరసనలు తెలిపారు ర్యాలీగా వెళ్లి తహసీల్దార్‌కు వినతిపత్రం అందచేశారు. వారు మాట్లాడుతూ మొన్న రాప్తాడు, నిన్న కర్నూలులో వైసీపీ అల్లరి మూకలు దాడులకు పాల్పడటం దారుణమన్నారు. అలా వరుస ఘటనలు పాత్రికేయులపై జరుగుతున్నా పోలీసులు అరెస్టు చేయకపోవడం పలు అనుమానాలకు తావిస్తున్నాయని అనుమానం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా దాడికి పాల్పడ్డ వారిని గుర్తించి శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన, ప్రజా సంఘాల నాయకులు, పాత్రికేయులు పాల్గొన్నారు.

ఆత్మకూరురూరల్: వైసీపీ ప్రభుత్వంలో మీడియాపై దాడులు జరుగుతున్నాయని, వైసిపి ప్రభుత్వం చేపడుతున్న ఉన్మాద చర్యలకు ఇవి నిదర్శనమని సీనియర్ న్యాయవాది, టీడీపీ నాయకుడు, ఆత్మకూరు మాజి సర్పంచ్ కంచర్ల గోవిందరెడ్డి అన్నారు. పట్టణంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మొన్న అమరావతిలో, నిన్న రాప్తాడులో, ఇప్పుడు కర్నూలులో వైసీపీ నాయకుల చర్యలు అప్రజాస్వామికమని విమర్శించారు.



బండిఆత్మకూరులో నిరసన

అమరావతిలో న్యూస్‌టుడే విలేకరి పరమేశ్వరరావుపై హత్యాయత్నానికి పాల్పడటం, రాప్తాడులో ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ కృష్ణపై, కర్నూలులో ఈనాడు కార్యాలయంపై రాళ్లు విసిరి విధ్వంసానికి పాల్పడటం ప్రజ్వామ్యంపై దాడిగా అభివర్ణించారు. బాధ్యులను గుర్తించి వారికి కఠిన శిక్ష పడేలా కృషి చేయాలని ఆయన కోరారు.

పాణ్యం: నిజాలు రాసినందుకే పత్రికా కార్యాలయాలు, పాత్రికేయులపై దాడులకు పాల్పడుతున్నారని టీడీపీ లీగల్ సెల్ రాష్ట్ర కార్యదర్శి రామ్మోహన్‌నాయుడు అన్నారు. కర్నూలు ఈనాడు కార్యాలయం, మద్దికెర ఆంధ్రజ్యోతి విలేకరిపై జరిగిన దాడికి నిరసనగా బుధవారం పాణ్యం తహసీల్దారు కార్యాలయం వద్ద మండల పాత్రికేయులు, టీడీపీ, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఖాదర్‌బాషా, పాత్రికేయులు ఏకే శ్రీనివాసులు, నవీన్‌కుమార్, వేణుగోపాల్, శీను, రంగస్వామి, సుధాకర్, రవి, అఫ్సర్‌బాషా, సీపీఎం నాయకులు భాస్కర్, ప్రతాప్. వెంకటాద్రి పాల్గొన్నారు.

గడివేముల: పాత్రికేయులపై, పత్రికా కార్యాలయంపై దాడులు చేయడం అనైతికమైన చర్య అని మాజీ జడ్పీటీసీ సీతారామిరెడ్డి, టీడీపీ సీనియర్ నాయకుడు పంట రామచంద్రారెడ్డి, గని హర్ష అన్నారు. మద్దికెరలో ఆంధ్రజ్యోతి విలేకరిపై, కర్నూలులోని ఈనాడు కార్యాలయంపై వైసీపీ కార్యకర్తలు చేసిన దాడిని నిరసిస్తూ బుధవారం ఏపీయూడబ్ల్యూజే, ఏపీడబ్ల్యూజేఎఫ్ ఆధ్వర్యంలో విలేకరులు ధర్నా చేశారు. గడివేముల కొత్తబస్టాండు కూడలి నుంచి పోలీసు స్టేషన్ వరకు ర్యాలీగా వెళ్లి ఏఎస్ఐ వెంకటేశ్వర్లుకు వినతి పత్రం అందజేశారు. ఏపీయూడబ్ల్యూజే జిల్లా ఉపాధ్యక్షుడు మల్లికార్జున నాయుడు, ఏపీడబ్ల్యూజేఎఫ్ నాయకుడు మహబూబ్‌బాషా మాట్లాడుతూ దాడి చేసిన వారిని అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో శ్యామ్‌సుందర్‌రెడ్డి, ఎల్ల సుబ్బయ్య, మహమ్మద్‌సాలేహా, మహబూబ్‌బాషా, చంద్రబాబు, లివి కుమార్, ముజీబ్, చెన్నయ్య, రాజేష్, శ్రీధర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.





వెలుగోడులో తహసీల్దార్‌కు, పాణ్యంలో డిప్యూటీ తహసీల్దారుకు వినతి పత్రాలు అందజేస్తున్న విలేకరులు తదితరులు

ఘనంగా మాతృభాషా దినోత్సవం

నంద్యాల (కల్చరల్), ఫిబ్రవరి 21: నంద్యాలలోసాహితీస్రవంతి సంస్థ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని పురస్కరించు కొని మాతృభాషా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా తెలుగుభాష ఔన్నత్యం పై చర్చ, కవి సమ్మేళనం నిర్వహించారు. కార్యక్రమంలో కవులు, గ్రంథాలయ పాఠకులు పాల్గొన్నారు.

- **చిన్నయసూరి సాహితీ సమితి ఆధ్వర్యంలో:** నాగార్జున పాఠశాలలో మాతృభాషా దినోత్సవాన్ని చిన్నయసూరి సాహితీ సమితి అధ్యక్షులు వైష్ణవ వెంకటరమణమూర్తి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా కవులు రమణమూర్తి, కొప్పుల ప్రసాద్, మాబుబాషా, ప్రసాద్‌ను నాగార్జున పాఠశాల కరస్పాండెంట్ వెంకటేశ్వర్లు ఘనంగా సన్మానించారు. విద్యార్థులకు పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.
- మాతృభాష విజ్ఞానానికి పునాదిగా నిలుస్తుందని, తెలుగు భాషను పరిపుష్టం చేసుకోవడం మనందరి కర్తవ్యం అని మాతృభాషా పరిరక్షణ సమితి కార్యదర్శి అన్నెం శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. నారాయణ జూనియర్ కళాశాలలో బుధవారం మాతృభాష పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో తెలుగు భాషా వికాసం-మన కర్తవ్యం అనే అంశముపై సాహితీ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు సూ.సా.సం అధ్యక్షుడు డాక్టర్ గెలివి సహదేవుడు, కళారాధన ప్రధాన కార్యదర్శి డా.రవికృష్ణ , ఆర్‌జేయూపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అవ్వారి శేషఫణి, తదితరు హాజరై ప్రసంగించారు. తెలుగుతల్లిని స్తుతిస్తూ విద్యార్థులు ఆలపించిన గేయాలు అందరిని అలరించాయి. ఈ సందర్భంగా నిర్వహించిన పాటల పోటీల విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ప్రిన్సిపాల్ కృష్ణారెడ్డి, పాల్గొన్నారు.

నందికొట్కూరు: నందికొట్కూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ ఆర్.సునీత అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి అంతర్జాతీయ అలయన్స్ క్లబ్ సంస్థ ప్రధాన అధికారి డా. రాయపాటి శ్రీనివాసులు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మన మాతృభాషలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కేవీఆర్ కళాశాల ఆంగ్ల అధ్యాపకుడు డా.ఎస్.ఎం.బాషా మాట్లాడుతూ మాతృభాషా మనోవిజ్ఞానానికి బాటలు వేయడానికి ఒక రహదారి లాంటివని, దేశాభివృద్ధి మాతృభాషల అభివృద్ధిపైనే ఆధారపడి ఉన్నాయన్నారు.

ప్రశంసా పత్రాల అందజేత

మాతృభాషా దినోత్సవాన్ని పురస్కరించుకొని అసోసియేషన్ ఆఫ్ అలయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో వివిధ భాషలకు సేవ చేసిన అధ్యాపకులకు,



నందికొట్కూరులో ప్రశంసా పత్రాలతో అధ్యాపకులు, విద్యార్థులు



నంద్యాలలో..

విద్యార్థులకు ఉత్తమ సేవా ప్రశంసా పత్రాలు అందజేశారు. నందికొట్కూరు డిగ్రీ కళాశాలకు చెందిన ప్రిన్సిపాల్ ఆర్.సునీత, .ఎం.అన్వర్ హుస్సేన్‌కు, ఎస్ఎం బాషా, కె.ఖాజా హుస్సేన్, ఎస్.తాజుద్దీన్, ఆర్.రఘుపతి రెడ్డి, పాణ్యానికి చెందిన అధ్యాపకురాలు ఫరీదా బేగం, తెలుగు, ఆంగ్ల భాషల్లో ప్రావీణ్యం చూపించిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేశారు.

ఆత్మకూరు: మాతృభాష పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వెంకటనర్సయ్య సూచించారు. ఆత్మకూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మాతృ భాషాభిమాన్ని చాటుకోవాలని సూచించారు. తెలుగు భాషా సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకునేం దుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించినప్పుడే భవిష్యత్ తరాలకు మాతృభాషాభిమాన్ని చాటేందుకు అవకాశం ఉంటుందన్నారు. అనంతరం తెలుగు అధ్యాపకులు విద్యాసాగర్ మాట్లాడుతూ.. భాషాలన్నింటిని పరిరక్షించుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ పద్మావతీబాయి, అధ్యాపకులు ఉన్నారు.

'రాష్ట్రాన్ని ఎడారిగా మార్చారు'



ప్రజా పోరు యాత్రలో మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

నంద్యాల (కల్చరల్), ఫిబ్రవరి 21: భారతదేశంలో అన్నపూర్ణలాంటి రాష్ట్రాన్ని వైసీపీ ప్రభుత్వం ఎడారిలా మార్చిందని బీజేపీ నంద్యాల నియోజకవర్గ కన్వీనర్ అభిరుచి మధు అన్నారు. నంద్యాల మండలంలోని కొత్తపల్లె, బిల్లలాపురం, అబాండం తండా, అయ్యలూరు గ్రామాలతో ప్రజా పోరు యాత్ర నిర్వహించారు. బీజేపీ నాయకులు, కార్యకర్తలు అభిరుచి మధు మాట్లాడుతూ నంద్యాలలో సాగు నీరుకు రైతులు, తాగు నీరుకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం పెట్టిన పథకా లకు రాష్ట్ర ప్రభుత్వం స్టిక్కర్లు వేసుకొని గొప్పలు చెప్పుకుంటోందన్నారు. అమృత పథకానికి నిధులు ఇచ్చినా కమీషన్ల కక్కుర్తితో పూర్తి కాలేదని విమర్శించారు. ప్రజలపై చెత్త పన్ను వేసిన ఘనత వైసీపీ ప్రభుత్వానిదే అన్నారు. నాయకులు కొశెట్టి కృష్ణమూర్తి, చంద్రశేఖర్, గంగాదర్, స్వాతి బాలన్న తదితరులు పాల్గొన్నారు.

జీసీ పాలెంలో గ్రామ సభ

బండిఆత్మకూరు, ఫిబ్రవరి 21: జీసీ పాలెంలో బుధవారం గ్రామ సభ నిర్వహించారు. ఉపాధి హామీ ఫీల్డు అసిస్టెంట్ ఎంపికకు ఝాన్సీ అనే మహిళను గ్రామ పంచాయతీ ఏకగ్రీవంగా తీర్మానించింది. మండల పరిషత్ అధికారి జీసీ పాలెం ఫీల్డు అసిస్టెంట్ ఎంపిక కోసం దరఖాస్తులు కోరగా స్థానిక ఝాన్సీ లక్ష్మీదేవి దరఖాస్తు చేసుకున్నారు. బుధవారం సాయంత్రం సర్పంచ్ కంచర్ల శోభారాణి అధ్యక్ష తన గ్రామ సభను ఇన్‌చార్జి కార్యదర్శి శ్రీకాంత్ నిర్వహించారు. గత ఫీల్డు అసిస్టెంట్ సుంకన్న సుమారు 8 నెలల క్రితం అనారోగ్యంతో మృతి చెందారు. ఆ స్థానంలో మృతుడి భార్య మేట్‌గా పనిచేసిన ఝాన్సీకి పంచాయతీ, ఉపాధి కూలీలు, ప్రజలు ఏకగ్రీవ అంగీకారం తెలపటంతో పంచాయతీ తీర్మానించినట్లు సర్పంచ్ తెలిపారు. ఉప సర్పంచ్ చిన్నలింగారెడ్డి, ఈసీ వరదరాజులు, టెక్నికల్ అసిస్టెంట్ శివారెడ్డి, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

న్యాయం చేయాలి

- ఆలయ తలుపులు వేసుకొని అర్చకుడి ఆందోళన



అర్చకుడికి నచ్చజెప్పుతున్న పోలీసులు

నంద్యాల క్రైం, ఫిబ్రవరి 21: న్యాయం చేయాలంటూ ఓ పూజారి ఏకంగా ఆలయంలోనే నిరసనకు దిగిన ఘటన నంద్యాల పట్టణంలో చోటుచేసుకుంది. నంద్యాల పట్టణంలోని పద్మావతి నగర్‌లో గల శ్రీకృష్ణ మందిరం అర్చకుడు సంగీతయ్య తనను ఓ రాజకీయ పార్టీకి చెందిన కొందరు వ్యక్తులు, ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారి మోసం చేశారని ఆరోపించారు. రాణి-మహారాణి థియేటర్ల ప్రాంతంలో తమ సొంత స్థలం 40 సెంట్లను ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారికి విక్రయించానని, అయితే మొత్తం డబ్బులు ఇవ్వకుండానే ఇచ్చినట్లు అగ్రిమెంట్ రాయించారని ఆరోపించారు. తనకు న్యాయం జరిగే వరకు తలుపులు తెరచుకుని బయటకు రానని, అవసరమైతే ఇక్కడే చావడానికైనా సిద్ధమని భీష్మించుకుకూర్చున్నారు. ఆలయ కమిటీ సభ్యులు, పోలీసులు న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో ఉదయం 6 గంటలకు తలుపులు వేసుకున్న పూజారి సాయంత్రం 4 గంటల అనంతరం తలుపులు తీసి బయటకు వచ్చారు.

అరాచక పాలనకు రోజులు దగ్గర పడ్డాయి: మాండ్ర

నందికొట్కూరు రూరల్, ఫిబ్రవరి 21: రాష్ట్రంలో వైసీపీ కొనసాగిస్తున్న అరాచక, దుర్మార్గ పాలనకు రోజులు దగ్గర పడ్డాయని టీడీపీ నంద్యాల లోక్‌సభ నియోజకవర్గ ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డి అన్నారు. నందికొట్కూరు మండలంలోని అల్లూరు గ్రామంలో బుధవారం మాండ్ర నివాసంలో ఆయన సమక్షంలో మిడుతూరు మండలం వీపనగండ్ల గ్రామ వైసీపీ నాయకులు ఆ మండల నాయకుడు మనోహర్ ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు. అలాగే నందికొట్కూరు పట్టణ వైసీపీ మహిళలు టీడీపీ నాయకుడు షకీల్ అహ్మద్ ఆధ్వర్యంలో చేరారు. వీరికి మాండ్ర శివానందరెడ్డి టీడీపీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో కరుణాకర్, నడిపి చిన్నయ్య, రాజు, దేవదాసు, పుల్లయ్య, మునిస్వామి, చెన్నప్ప, ప్రవీణ్ కుమార్, పి.రాజు, శ్రీరాములు, స్వాములు, సి.రాజు, జ్ఞానప్రకాష్, సంజీవ శేషాద్రి, సమీన, యాస్మిన్, అసిఫా, రాజమ్మ, సునీత, లక్ష్మీ, జ్యోతి, జయమ్మ, మేఘన, సలోమి, శరీఫా, ఇందు, భవానీ, నరసింహ, రవివర్మ, నాగార్జున, తదితరులు ఉన్నారు. గుండం రమణారెడ్డి, జయసూర్య, తిరుపాలు, మోహిద్దీన్ పాల్గొన్నారు.

'ఓటమి భయంతోనే విలేకరులపై దాడులు'

ఓటమి భయంతోనే వైసీపీ నాయకులు, కార్యకర్తలు ఉద్దేశపూరకంగానే విలేకర్లు, పత్రికా కార్యాలయాలపై దాడులకు పాల్పడుతున్నారని టీడీపీ నంద్యాల లోక్‌సభ నియోజకవర్గ ఇన్‌చార్జి మాండ్ర శివానందరెడ్డి అన్నారు.



మాండ్ర సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీకి చెందిన నందికొట్కూరుకు మహిళలు

అల్లూరు గ్రామంలో మాండ్ర నివాసంలో శివానందరెడ్డి మాట్లాడుతూ సిద్ధం సభలో ముఖ్యమంత్రి సమక్షంలో వైసీపీ మూకలు ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై, కర్నూలులో ఈనాడు కార్యాలయంపై కాటసాని వర్గీయులు దాడులు చేయడం దారుణమన్నారు. ప్రజాస్వామ్య దేశంలో ఇలాంటివి సరికాదన్నారు. ఇది ముమ్మాటికీ క్షమించరాని నేరమన్నారు. దాడులు చేసిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాండ్ర సురేంద్రనాథరెడ్డి, ఓబుల్ రెడ్డి, జయసూర్య, రవీంద్రంబాబు, నారపురెడ్డి రంగారెడ్డి, బాబుసాహెబ్, బ్రహ్మానందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ ఆటో డ్రైవర్ మృతి

- వైసీపీ నాయకుడి భార్య చెప్పుతో కొట్టడంతో పది రోజుల క్రితం ఆత్మహత్యాయత్నం
- ఆసుపత్రి వద్ద కుటుంబ సభ్యులు, ప్రజా సంఘాల ఆందోళన
- చర్యలు తీసుకోవాలని డిమాండ్



మృతి చెందిన ఓబులేసు



రోడ్డుపై బైఠాయించిన ఓబులేసు కుటుంబ సభ్యులు

నంద్యాల క్రైం, ఫిబ్రవరి 21: ఆత్మహత్యాయత్నం చేసిన ఆటో డ్రైవర్ చికిత్స పొందుతూ మృతి చెందారు. నంద్యాలలోని సాయిబాబానగర్‌కు చెందిన ఓబులేసు గత 30సంవత్సరాలుగా ఆటో నడుపుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. పది రోజుల క్రితం నంద్యాల బాలాజీ కాంప్లెక్స్‌లోని సాయి మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ దగ్గర రోడ్డు పక్కన ప్యాసింజర్లను దింపేందుకు ఆటోను నిలబెట్టగా అటుగా కారులో వచ్చిన వైసీపీ నాయకుడు దేరెడ్డి శివనాగిరెడ్డి భార్య శివానందమ్మ ఆటోను పక్కకు తొలగించలేదని కారులోనుంచి దిగి ఆటో డ్రైవర్ ఓబులేసును చెప్పుతో కొట్టారు. ఎలాంటి తప్పు చేయని తనను చెప్పుతో కొట్టడంపై తీవ్ర మనస్తాపానికి గురైన ఆటో డ్రైవర్ ఓబులేసు సమీపంలో ఉన్న పురుగులమందు అంగడికి వెళ్లి పురుగులమందు కొని ఆస్పత్రి ఎదుట ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. వెంటనే స్థానికులు చికిత్స నిమిత్తం నంద్యాల జీజీహెచ్‌కు తరలించారు. విషయం తెలుసుకున్న బాధిత కుటుంబ సభ్యులు, సీఐటీయూ జిల్లా నాయకుడు లక్ష్మణ్, ఆటో వర్కర్స్ యూనియన్ నాయకులు దాడికి పాల్పడిన మహిళ ఇంటిముందు అప్పట్లో ఆందోళనకు దిగారు. దీంతో అక్కడ ఉద్రిక్త వాతావరణం చోటుచేసుకోవడంతో పోలీసులు రంగప్రవేశం చేసి ఇరువర్గాలతో చర్చించి ఓబులేసు పరిస్థితి విషమంగా ఉండటంతో పట్టణంలోని ఉదయానంద హాస్పిటల్‌కు తరలించారు. అక్కడ పదిరోజులుగా చికిత్స పొందుతున్న ఓబులేసు చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందారు. దీంతో ఓబులేసు భార్య లక్ష్మి, కూతురు స్వాతి కుప్పకూలిపోయారు. కుటుంబాన్ని పోషించే యజమాని మరణించడంతో తాము ఎలా బతకాలంటూ గుండెలవిసేలా రోదించారు. బాధిత కుటుంబ సభ్యులు, బంధువులు, ఆటో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్, వివిధ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఉదయానంద హాస్పిటల్ దగ్గర ఆందోళన చేపట్టారు. దీంతో రెండు గంటలపాటు ట్రాఫిక్ స్తంభించిపోయింది. ఆటో డ్రైవర్ ఓబులేసును చెప్పుతో కొట్టి ఆయన మరణానికి కారణమైన శివానందమ్మను, ఆమె భర్త వైసీపీ నాయకుడు, బండిఆత్మకూరు మాజీ ఎంపీపీ, వీఆర్వోల సంఘం అధ్యక్షుడిగా గతంలో పనిచేసిన దేరెడ్డి శివనాగిరెడ్డిని, దాడిచేసిన ఆస్పత్రి సిబ్బందిని అరెస్ట్ చేసి, మృతుడి కుటుంబానికి న్యాయం జరిగేంతవరకు ఆందోళన కొనసాగిస్తామని రోడ్డుపై బైఠాయించారు. త్రీ టౌన్ సీఐ నరసింహులు, పోలీసులు ఆందోళనకారులకు సర్దిచెప్పేందుకు ప్రయత్నించినా మృతుడి కుటుంబానికి న్యాయం జరిగే వరకు ఆందోళన కొనసాగిస్తామని బైఠాయించారు.

డోన్

డోన్, ఆళ్లగడ్డ, బనగానపల్లె

రాష్ట్రంలో అవినీతి పాలన: మాజీ మంత్రి



మహిళలతో మాట్లాడుతున్న అఖిలప్రియ

నంద్యాల, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అవినీతి, అక్రమాల పాలన సాగుతోందని, అభివృద్ధి మచ్చుకైనా కన్పించడం లేదని మాజీ మంత్రి అఖిలప్రియ ఆరోపించారు. ఆళ్లగడ్డ పట్టణంలోని విద్యానగర్, ఎల్ఎం కాంపౌండులలో బుధవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో రాక్షస పాలనను అంతమొందించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. రాష్ట్ర ప్రజలకు సీఎం జగన్ చేసిందేమీ లేదన్నారు. నిరుద్యోగులతో ప్రభుత్వం చెలగాటమాడుతోందన్నారు. ఎస్సీ, ఎస్టీలకు సీఎం జగన్ చేసింది శూన్యమన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ హుసేన్‌బాషా, సోముల భాస్కరరెడ్డి, మాజీ కౌన్సిలర్ నరసింహులు, భాస్కర్, శివ, టీడీపీ మహిళా కార్యకర్తలు నూర్జహాన్, రమిజా, సుభహాని, పూజిత తదితరులు పాల్గొన్నారు.

ఘర్షణలకు పాల్పడితే చర్యలు: డీఎస్పీ



ఆలమూరులో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆళ్లగడ్డ డీఎస్పీ

రుద్రవరం, ఫిబ్రవరి 21: వచ్చే ఎన్నికల్లో ఘర్షణలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఆళ్లగడ్డ డీఎస్పీ షర్ఫుద్దీన్ హెచ్చరించారు. మండలంలోని ఆలమూరు గ్రామంలో బుధవారం రాత్రి పోలింగ్ కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ ఆళ్లగడ్డ నియోజకవర్గంలో 34 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలు గుర్తించామని చెప్పారు. రుద్రవరం మండలంలోని ఎర్రగుడిదిన్నె, ఆలమూరు గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలుగా గుర్తించినట్లు తెలిపారు. అల్లర్లకు పాల్పడితే ఏ రాజకీయ పార్టీ నాయకులనూ ఉపేక్షించబోమని అన్నారు. ఏవైనా సమస్యలు ఉంటే పోలీసుల దృష్టికి తీసుకురావాలని ససూచించారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఐ నిరంజన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

శిరివెళ్ల: నియోజకవర్గంలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తున్నట్లు డీఎస్పీ షర్ఫుద్దీన్ తెలిపారు. మండలంలోని బోయలకుంట్ల, గోవిందపల్లె, శిరివెళ్ల గ్రామాల్లోని పలు పోలింగ్ కేంద్రాలు, వాటిలోని వసతులను ఆయన బుధవారం పరిశీలించారు. ప్రజలు క్షణికావేశానికి లోనై గొడవలకు పాల్పడి కేసుల్లో ఇరుక్కోవద్దని సూచించారు. గ్రామాల్లో శాంతిభద్రతలకు భంగం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ హెచ్చరించారు. రెవెన్యూ, పోలీసు శాఖ సిబ్బంది ఉన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వద్దు: డీఈ



మాట్లాడుతున్న హౌసింగ్ డీఈ నాగరాజు

ఉయ్యాలవాడ, ఫిబ్రవరి 21: విధుల్లో నిర్లక్ష్యం వద్దని హౌసింగ్ డీఈ నాగరాజు ఆదేశించారు. బుధవారం వివిధ సచివాలయాల ఇంజనీరింగ్ అసిస్టెంట్లుతో సమావేశం నిర్వహించారు. డీఈ మాట్లాడుతూ నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో ఇప్పటి వరకు 9,513 గృహ నిర్మాణాలు పూర్తి చేశామని, మరో 2,716 నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయని చెప్పారు. మార్చి నెలాఖరులోపు 751 గృహ నిర్మాణాలు పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు. అలాగే 5,652 మరుగుదొడ్లు మంజూరు కాగా 1369 నిర్మాణాలు పూర్తయినట్లు తెలిపారు. గృహ నిర్మాణాలు పూర్తయిన వాటికి ఎన్నికల కోడ్ సంబంధం లేకుండా బిల్లులు మంజూరు చేస్తామని, బిల్లుల మంజూరులో జాప్యం ఉండదని చెప్పారు. ఎంపీడీవో రఘురామ్, ఏఈ నరసింహుడు, ఉపాధి ఏపీవో రవి ప్రకాశ్ పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

బనగానపల్లె, ఫిబ్రవరి 21: క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందని జెకెఆర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు బ్రహ్మానందచారి అన్నారు. బుధవారం పలుకూరు గ్రామంలో డీపీయూపీ, ఉర్దూ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం రమాదేవి, ఉపాధ్యాయులు రాజుశ్, రమణ, మహబూబ్‌బాషా, అంగన్‌వాడీ టీచర్లు, సుకన్య, శ్రీదేవి, రాజు పాల్గొన్నారు..

రైతులకు అవగాహన సదస్సు

కోవెలకుంట్ల, ఫిబ్రవరి 21: మండలంలోని సౌదరదిన్నె, అమడాల, బిజనవేముల, వెలగటూరు గ్రామాల్లో బుధవారం నవభారత్ ఫర్టిలైజర్స్ కంపెనీ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. మార్కెటింగ్ అధికారి సుభాన్ మాట్లాడుతూ రసాయనిక ఎరువులు పంటల సాగులో అధికంగా వాడడం వల్ల ఆహార ఉత్పత్తులు విషతుల్యం అవడమేగాక భూసారం తగ్గిపోతుందన్నారు. రైతులు సేంద్రియ ఎరువులనే వాడాలన్నారు. కార్యక్రమంలో కృష్ణమూర్తి, జగదీశ్, రైతులు గురప్ప, అంజి, బాషా పాల్గొన్నారు.

సభను విజయవంతం చేయండి

అవుకు, ఫిబ్రవరి 21: సత్యసాయి జిల్లా కదిరి పట్టణంలో ఈనెల 25న జరిగే బంజారాల సింహగర్జన సభను విజయవంతం చేయాలని ఆల్ ఇండియా బంజారా సేవాసంఘ్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకట రమణ నాయక్ పిలుపునిచ్చారు. బుధవారం అవుకు పట్టణంలో కార్యాలయంలో బంజారా నాయకులతో సమావేశాన్ని నిర్వహించారు ఈ సందర్భంగా రమణనాయక్ మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చి75 సంవత్సరాలు గడిచినా బంజారాలపై ప్రభుత్వాలు వివక్ష చూపుతున్నాయన్నారు

'సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించాలి'

రుద్రవరం, ఫిబ్రవరి 21: సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించాలని సీఐ చంద్రబాబు సూచించారు. మండలంలోని చిత్తరేణిపల్లె, ఆలమూరు, నరసాపురం, ముకుందాపురం, ముత్తలూరు, టి.లింగందిన్నె, తిప్పారెడ్డిపల్లె, హరినగరం గ్రామాల్లో బుధవారం పోలింగ్ కేంద్రాలు పరిశీలించి కనీస సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. పోలింగ్ జరిగే గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంతంగా ఎన్నికలు జరిగేలా చూడాలన్నారు. ఆయన వెంట ఎస్ఐ నిరంజన్‌రెడ్డి, ఏఎస్ఐ శోభన్‌బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

'నకిలీ మందులు విక్రయిస్తే చర్యలు'

రుద్రవరం, ఫిబ్రవరి 21: నకిలీ మందులు విక్రయిస్తే చర్యలు తప్పవని ఏవో శ్రీకృష్ణ హెచ్చరించారు. మండలంలోని చిత్తరేణిపల్లెలో బుధవారం పురుగు మందుల దుకాణంలో శాంపిళ్లను సేకరించామని చెప్పారు. మండలంలో రబీ సీజన్‌లో 8268 మంది సాగు చేసిన 16500 ఎకరాల్లో వివిధ పంటలను పంట నమోదు చేశామని తెలిపారు.

శివస్వాములకు భిక్ష

బనగానపల్లె, ఫిబ్రవరి 21: పట్టణంలోని రవ్వలకొండ వద్ద గుండ్ల శింగవరం సర్పంచ్ రమాకాంత్‌రెడ్డి పోతులూరు వీరబ్రహ్మేంద్రస్వామి నిత్యాన్నదాన సంస్థ ఆధ్వర్యంలో బుధవారం శివస్వాములకు భిక్ష ఏర్పాటు చేశారు. ట్రస్టు సభ్యులు నాగమునిరాజు, కె.వెంకటేశ్వర్లు, రాయల్ సుబ్బరాయుడు, వెంకటరామిరెడ్డి, రాజారెడ్డి పాల్గొన్నారు.

జర్నలిస్టులపై దాడి చేసిన వారిని అరెస్టు చేయాలి

ప్రజా సంఘాల నాయకుల డిమాండ్

బేతంచెర్ల, ఫిబ్రవరి 21: పత్తికొండ నియోజకవర్గం మద్దికెర ఆంధ్రజ్యోతి విలేకరి వీరశేఖర్‌పై, కర్నూలు నగరంలోని ఈనాడు కార్యాలయంపై దాడి చేసిన వైసీపీ మూకలను వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని బుధవారం ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో పాతబస్టాండులో రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ జర్నలిస్టు వెంకట్రాముడు, టీడీపీ ఎస్సీ, ఎస్టీ సెల్ పట్టణ ఎస్సీ సెల్ నాయకులు నాగరాజు, రవీంద్రనాయక్, గూటం శివ, జనసేన పార్టీ నాయకులు చల్లా మద్దిలేటి, సీపీఐ నాయకులు భార్గవ్ మాట్లాడుతూ ప్రభుత్వానికి, ప్రజలకు వారధిగా పని చేస్తూ నిజాలను నిర్భయంగా రాస్తున్న జర్నలిస్టులపై, ఈనాడు కార్యాలయంపై వైసీపీ మూకలు దాడులు చేయడం అమానుషమని ఖండించారు. కార్యక్రమంలో జర్నలిస్టులు వెంకటేష్‌గౌడు, లక్ష్మయ్య, రాముడు, సుబ్బరాయుడు, న్యాయవాది నందిపల్లె నారాయణ, టీడీపీ ఉపాధ్యక్షుడు పోలూరు వెంకటేశ్వరరెడ్డి, మండల కన్వీనర్ ఉన్నం ఎల్ల నాగయ్య, షేక్షావలి చౌదరి, తిరుమలేష్ చౌదరి, ఉన్నం సుధాకర్, జాకీరుల్లాబేగ్, రమేష్, రవీంద్ర నాయక్, మేకల నాగరాజు, రామాంజనేయులు, రూబెన్, రామగోపాల్, ఏఐఎస్ఎఫ్ ఉదయ్ పాల్గొన్నారు.

దాడులు అప్రజాస్వామికం

డోన్: జర్నలిస్టులపై, పత్రికా కార్యాలయాలపై దాడులు చేయడం అప్రజాస్వామిక చర్య అని డోన్ జర్నలిస్టుల సంఘం యూనియన్ నాయకులు సూర్య వెంకటేశ్, ఖాదర్, శేఖర్ అన్నారు. బుధవారం డోన్ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ శరత్‌కుమార్ రెడ్డికి ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మద్దికెర ఆంధ్రజ్యోతి వీరశేఖర్‌పై వైసీపీ నాయకులు దాడి చేయడం సిగ్గు చేటన్నారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో జర్నలిస్టులు సుధాకర్, మోహన్, తదితరులు ఉన్నారు.

వైసీపీ మూకలను అరెస్టు చేయాలి: సీపీఎం

డోన్(రూరల్): జర్నలిస్టులపై దాడులు చేసిన వైసీపీ మూకలను తక్షణమే అరెస్టు చేయాలని సీపీఎం పట్టణ, మండల కార్యదర్శులు కోయలకుండ నాగరాజు, నక్కి శ్రీకాంత్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం జర్నలిస్టులపై జరుగుతున్న దాడులకు నిరసనగా సీపీఎం ఆధ్వర్యంలో డోన్-బేతంచెర్ల ప్రధాన రోడ్డులో జర్నలిస్టులతో కలిసి రాస్తారోకో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం అనుబంధ సంఘాల నాయకులు రామాంజనేయులు, కొండయ్య, నక్కి హరి, నాగన్న, అక్బర్ పాల్గొన్నారు.

ఇది పత్రికా స్వేచ్ఛపై దాడి: జర్నలిస్టులపై, పత్రికా కార్యాలయాలపై జరుగుతున్న దాడులు పత్రికా స్వేచ్ఛపై దాడి అని డోన్ పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు కేఎన్ భానుసింగ్ అన్నారు. బుధవారం పెన్షనర్ల సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సంఘం సభ్యుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ పాలనలో ప్రజాస్వామ్యం కూనికి గురవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. పెన్షనర్ల సంఘం నాయకులు మౌలాలి, గోపాల్, బాలయ్య, సుబ్బరాయుడు, వెంకటస్వామి, మద్దిలేటి, దాసప్ప పాల్గొన్నారు.

ప్యాపిలి: అనంతపురం జిల్లా రాప్తాడులో ఆంధ్రజ్యోతి ఫొటో గ్రాఫర్‌పై దాడి, కర్నూలు ఈనాడు ప్రాంతీయ కార్యాలయంపై వైసీపీ మూకల దాడిని నిరసిస్తూ బుధవారం పట్టణంలోని తహసీల్దారు కార్యాలయం ఎదుట విలేకర్లు నిరసన వ్యక్తం చేశారు. పత్రికా స్వేచ్ఛను హరించివేస్తున్న వైసీపీ ప్రభుత్వానికి పతనం తప్పదని పలువు జర్నలిస్టులు విమర్శించారు. అనంతరం తహసీల్దారు ప్రతాప్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో విలేకర్లు సుధాకర్‌రెడ్డి, సురేష్, వీరాంజినేయులు, శేషయ్య, గఫూర్, రహంతుల్లా, బాషా, రమేష్, వంశీ, రామాంజనేయులు పాల్గొన్నారు.

దాడులు దుర్మార్గం

చాగలమర్రి: వైసీపీ పాలనలో పాత్రికేయులపై దాడులు చేయడం దుర్మార్గమని సీమాంధ్ర బీసీ సంఘం జిల్లా కన్వీనర్ సల్లా నాగరాజు, టీఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శి గుత్తి నరసింహులు, టీడీపీ నాయకుడు అబ్దుల్లా, శంకర సుబ్బారావు అన్నారు. బుధవారం సాయంత్రం చాగలమర్రి గ్రామంలోని గాంధీ సెంటర్‌లో వివిధ ప్రజా సంఘాలు, టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ కర్నూలులో ఈనాడు కార్యాలయం, మద్దికెరలో ఆంధ్రజ్యోతి విలేకరిపై దాడులు చేయడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో హమాలి సంఘ నాయకులు నరసింహుడు, విశ్వబ్రాహ్మణ సంఘ నాయకుడు బ్రహ్మయ్య, యాదవ సంఘం సభ్యుడు రంగనాయకులు, దూదెకుల నూర్‌బాషా సంఘం మండల అధ్యక్షుడు మహబూబ్‌బాషా, ఎమ్మార్పీఎస్ మాజీ అధ్యక్షుడు ఓబులేసు, ఆర్యవైశ్య సంఘ నాయకులు శంకర సుబ్బారావు, రమేష్, మధు, బాలకృష్ణ, నరేంద్ర, ఎరుకల సంఘం నాయకుడు వెంకటయ్య, రమణ పాల్గొన్నారు

విలేకరులకు అండగా పోలీసులు: డీఎస్పీ

నంద్యాల, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): ప్రజలకు, ప్రభుత్వాలకు వారధిగా పనిచేసే విలేకరులకు పోలీస్‌శాఖ అండగా ఉంటుందని డీఎస్పీ షర్ఫుద్దీన్ అన్నారు. కర్నూలు ఈనాడు పత్రికా కార్యాలయంపై, ఆంధ్రజ్యోతి విలేకరులపై దాడులు జరపడాన్ని నిరసిస్తూ బుధవారం ఆళ్లగడ్డ డీఎస్పీకి పాత్రికేయులు వినతి పత్రం సమర్పించారు. విలేకరులపై దాడులు జరిగితే వెంటనే చర్యలు తీసుకుంటామని డీఎస్పీ హామీ ఇచ్చారు. విలేకరులకు ఏ సమస్య వచ్చినా తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో పట్టణ సీఐ రమేష్‌బాబు, పాత్రికేయులు మోహన్‌రెడ్డి, శ్రీనివాసులు, నిజాం, ప్రసాద్, సర్దార్, మోహిద్దీన్, బాషా, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

దాడి హేయమైన చర్య: ఆంధ్రజ్యోతి విలేఖరులపై, కర్నూలులో ఈనాడు కార్యాలయంపై దాడులు చేయడం హేయమైన చర్య అని ఉమ్మడి కర్నూలు జిల్లా టీడీపీ మాజీ ఉపాధ్యక్షుడు సంజీవరాయుడు, ఆళ్లగడ్డ మాజీ జడ్పీటీసీ చాంద్‌బాషా తీవ్రంగా ఖండించారు. బుధవారం వారు మాట్లాడుతూ విలేకరులు రాసిన వార్తలపై ఖండన ఇచ్చుకోవాలని, లేని పక్షంలో కోర్టును ఆశ్రయించాలని అన్నారు. విలేకరులపై దాడులు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండు చేశారు.

- విలేఖరులకు అండగా ఉంటామని న్యాయవాదులు శివప్రసాదరావు, శిరివెళ్ల రమణయ్య అన్నారు. ఈనాడు కార్యాలయంపై, ఆంధ్రజ్యోతి విలేఖరులపై జరిగిన దాడులను వారు తీవ్రంగా బుధవారం ఖండించారు. అనంతరం సీనియర్ పాత్రికేయులు మోహన్‌రెడ్డి, సుబ్బారావు, నాగరాజును శాలువ పూలమాలలతో ఘనంగా సత్కరించారు.

దాడి చేసిన వారిని శిక్షించాలి

బనగానపల్లె: జర్నలిస్టులపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని ఏపీడబ్ల్యూజేఎఫ్ జిల్లా కన్వీనర్ మద్దయ్యయాదవ్ డిమాండ్ చేశారు. బుధవారం బనగానపల్లె పట్టణంలోని తహసీల్దారు కార్యాలయం ముందు మద్దికెర ఆంధ్రజ్యోతి విలేఖరి వీరశేఖర్‌పై వైసీపీ మూకల దాడి, కర్నూలులో ఈనాడు కార్యాలయంపై ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి అనుచరులు దాడికి నిరసనగా జర్నలిస్టులు బనగానపల్లె తహసీల్దారు ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దారు రవీంద్రారెడ్డికి వినతిపత్రం సమర్పించారు. ఈసందర్భంగా యూనియన్ నాయకుడు మద్దయ్య మాట్లాడుతూ వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత జర్నలిస్టులపై దాడులు అధికమయ్యాయన్నారు. రాప్తాడు సభలో ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై దాడి మరువక ముందే వైసీపీ మూకలు విలేఖర్లు, పత్రికా కార్యాలయలాపై దాడులకు తెగబడుతున్నాయన్నారు. కార్యక్రమంలో ఆంధ్రజ్యోతి విలేకరి వెంకటేశ్వర్లు, రామచంద్రారెడ్డి, నరసింహా రెడ్డి, జవహర్, షాషావలి, రఘురామిరెడ్డి, చంద్రశేఖర్, మధు, రాజేశ్, వెంకట రాముడు, నాగేశ్, రమణ, సుబ్బయ్య, ఓబులేసు, శ్రీకాంత్, వేణుగోపాల్ రెడ్డి, బాలయ్య, దస్తగిరి, వెంకటరాముడు, సుధాకర్ పాల్గొన్నారు.

దాడి అమానుషం

కోవెలకుంట్ల: కర్నూలులో ఈనాడు కార్యాలయం, మద్దికెరలో ఆంధ్రజ్యోతి విలేఖరి వీరశేఖర్‌పై దాడి అమాషమని ఏపీడబ్ల్యూజేఎఫ్ నాయకులు అన్నారు. బుధవారం కోవెలకుంట్ల తహసీల్దారు కార్యాలయం వద్ద విలేకరులు నిరసన వ్యక్తం చేశారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం సీనియర్ అసిస్టెంట్ రామనాథ్‌రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. వైసీపీ అధికా రంలోకి వచ్చిన తర్వాత జర్నలిస్టులపై దాడులు అధికమయ్యాయన్నారు. రాప్తాడు సభలో ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై దాడి మరువకముందే వైసీపీ మూకలు విలేఖర్లు, పత్రికా కార్యాలయలాపై దాడులకు తెగబడుతున్నాయన్నారు. ఆంధ్రజ్యోతి విలేఖరి శ్రీనివాసులు, జవహర్, రమణ, వెంకటేశ్, నాగేశ్వరరావు, రామాంజనేయులు పాల్గొన్నారు.

సంజామల: విలేకరులపై దాడులకు పాల్పడుతున్న వైసీపీ అల్లరి మూకలను అరెస్టు చేయాలని సంజామలలో ఏపీడబ్ల్యూజే ఆధ్వర్యంలో బుధవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద నాయకులు నిరసన తెలిపారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ అనంతపురం జిల్లా రాప్తాడులో సీఎం జగన్ సిద్ధం సభలో ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై దాడి మరువకముందే.. ఆంధ్రజ్యోతి మద్దికెర రిపోర్టర్ వీరశేఖర్‌పై దాడి చేయడం, అలాగే కర్నూలు ఈనాడు కార్యాలయంపై దాడులు చేయడం దుర్మార్గమైన చర్య అని మండల విలేకరులు కొలిమి ఖాజాహుస్సేన్, మహ బూబ్ బేగ్, నాగేశ్వర్లు, నాగరాజు, మహమ్మద్ రఫీ, సతీష్ కుమార్ అన్నారు. అనంతరం ఆర్ఐ వెంగళ్ రెడ్డి వినతి పత్రం అందజేశారు.



డోన్‌లో ఎస్ఐకి వినతి పత్రం ఇస్తున్న జర్నలిస్టులు



కొలిమిగుండ్లలో..



ప్యాపిలిలో..



బేతంచెర్లలో నిరసన తెలుపుతున్న టీడీపీ, ప్రజా సంఘాల నాయకులు



చాగలమర్రిలో..



డోన్‌లో రాస్తారోకో నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు



బనగానపల్లెలో..



ఆళ్లగడ్డలో డీఎస్పీకి వినతి పత్రం ఇస్తున్న పాత్రికేయులు



కోవెలకుంట్లలో..



సంజామలలో..

కొలిమిగుండ్ల: పత్రికల్లో వార్తలు రాస్తున్న జర్నలిస్టులపై దాడులు చేయడం అమానుషమని ఏపీయూడబ్ల్యూజే జిల్లా నాయకుడు శేఖర్‌రెడ్డి అన్నారు. కర్నూలులో ఈనాడు కార్యాలయంపై, మద్దికెర ఆంధ్రజ్యోతి విలేకరిపై దాడులకు నిరసనగా కొలిమిగుండ్లలో తహసీల్దారు సునీతాబాయికి వినతిపత్రం సమర్పించారు. విలేకరులు, సీపీఐ, సీపీఎం నాయకులు నవీన్‌కుమార్, శేఖర్‌రెడ్డి, పెద్దరాజు, అశోక్‌కుమార్, రమణ, విజయకుమార్, నాయుడు, సూర్యనారాయణ, దావీదు, వెంకటమహేశ్, పవన్ పాల్గొన్నారు.

వచ్చేది టీడీపీ, జనసేన ప్రభుత్వమే

డోన్, ఫిబ్రవరి 21: రాబోయే ఎన్నికల్లో టీడీపీ-జనసేన కూటమి ప్రభుత్వం రావడం ఖాయమని టీడీపీ డోన్ ఇన్‌చార్జి ధర్మవరం సుబ్బారెడ్డి అన్నారు. బుధవారం సాయంత్రం మండలంలోని కొచ్చెర్వు గ్రామంలో టీడీపీ ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ-భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించి టీడీపీ మేనిఫెస్టో కరపత్రాలు పంపిణీ చేశారు. సుబ్బారెడ్డి మాట్లాడుతూ వైసీపీ ఇష్టారాజ్యంగా అవినీతికి పాల్పడుతూ ప్రజల జేబులను గుల్ల చేస్తున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వలసల రామకృష్ణ, మండల పార్టీ అధ్యక్షుడు శ్రీనివాసులు యాదవ్, అభిరెడ్డిపల్లె గోవిందు, ఎస్ఎండీ రఫీ, మధుసూదన్ రెడ్డి, కొచ్చెర్వు రామాంజనేయులు, మద్దయ్య, తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీలో సరస్వతి పూజ

చాగలమర్రి, ఫిబ్రవరి 21: చాగలమర్రిలోని కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయలో ప్రిన్సిపాల్ సునీత ఆధ్వర్యంలో బుధవారం విద్యార్థినులు సరస్వతి పూజ నిర్వహించారు. పది పరీక్షలు సమీపిస్తుండటంతో పది, ఇంటర్ విద్యార్థినులతో సరస్వతిదేవికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం బాలికలు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఉపాధ్యాయినులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నేడు ఆర్థిక మంత్రి రాక

ప్యాపిలి, ఫిబ్రవరి 21: రాష్ట్ర ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి గురువారం ప్యాపిలికి వస్తున్నట్లు డిప్యూటీ తహసీల్దారు మారుతి తెలిపారు. పట్టణంలోని షాదీఖానాలో పేదలకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేయనున్నట్లు ఆయన తెలిపారు.

వెదుర్ల వేలం

రుద్రవరం, ఫిబ్రవరి 21 : రుద్రవరం కలప డిపోలో మూడో తరగతి 9వేల వెదుర్లు సబ్ డీఎఫ్‌వో శ్రీనివాసరెడ్డి బుధవారం వేలం నిర్వహించారు. ఈ వేలంలో రూ.1,66,800 ఆదాయం వచ్చిందని చెప్పారు. కార్యక్రమంలో రేంజర్ శ్రీపతినాయుడు, డిప్యూటీ రేంజ ర్ ముర్తుజావలి, సెక్షన్ ఆఫీసరు నాగరాజు, బీట్ ఆఫీసర్ మహబూబ్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గ్రామోత్సవం

శిరివెళ్ల, ఫిబ్రవరి 21 : గ్రామంలో పునః ప్రతిష్ఠిస్తున్న బసవేశ్వర స్వామి ఆలయ ప్రతిష్ఠ వేడుకల్లో భాగంగా వినాయక, అన్నపూర్ణ విశాలాక్షి సమేత కాశీవిశ్వేశ్వర-బసవేశ్వర స్వామి ప్రతిష్ఠామూర్తులకు బుధవారం గ్రామోత్సవం నిర్వహించారు. వీరగాశి మూర్తుల విన్యాసాలు, నందికోల సేవల మధ్య గ్రామోత్సవం నిర్వహించారు.

పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

చాగలమర్రి, ఫిబ్రవరి 21: జిల్లాలోని ఆయా గ్రామాల్లో పని చేస్తున్న పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు యేసు రత్నం డిమాండ్ చేశారు. బుధవారం చాగలమర్రి ఆర్సీఎం పాఠశాల ఆవరణలో బుధవారం గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ సమావేశం బాబు అధ్యక్షతన నిర్వహించారు.

ప్రజలను మోసగిస్తున్న మంత్రి బుగ్గన: సుబ్బారెడ్డి



పనులు పూర్తి కాని టీటీడీ కల్యాణ మండపం వద్ద సుబ్బారెడ్డి

డోన్, ఫిబ్రవరి 21: డోన్ నియోజకవర్గంలో అసంపూర్తి పనులను హడావుడిగా ప్రారంభిస్తూ మంత్రి బుగ్గన ప్రజలను మోసం చేస్తున్నారని టీడీపీ డోన్ ఇన్‌చార్జి ధర్మవరం సుబ్బారెడ్డి అన్నారు. బుధవారం డోన్ మండలంలోని గుండాల గ్రామంలో ప్రారంభించిన టీటీడీ కళ్యాణ మండపం అసంపూర్తి పనులను సుబ్బారెడ్డితో పాటు పార్టీ నాయకులు పరిశీలించారు. అనంతరం సుబ్బారెడ్డి మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో ఓటమి భయంతోనే మంత్రి బుగ్గన నిర్మాణ పనులు పూర్తి కాకుండానే ప్రారంభిస్తున్నారన్నారు. ఏడాది కింద పూర్తి చేసిన టీటీడీ కళ్యాణ మండపం నిర్మాణ పనులు పూర్తి కాకున్నా ప్రారంభించడం ప్రజలను మోసగించడం కాదా అని ప్రశ్నించారు. సీఎం జగన్‌తో హడావుడిగా చెరువులకు నీళ్లు నింపే కార్యక్రమాన్ని ప్రారంభించినా ఇప్పటి వరకు ఆ చెరువులకు నీళ్లు రాలేదని ధ్వజమెత్తారు. డోన్‌లో వంద పడకల ఆసుపత్రి, కూరగాయల మార్కెట్ పనులు అసంపూర్తిగా ఉన్నాయని, వాటిని పూర్తి చేసే బాధ్యత తానే తీసుకుంటానని సుబ్బారెడ్డి ప్రకటించారు. వైసీపీ నాయకుడు వెన్నెపూస గోపాల్ రెడ్డి మాజీ ఎమ్మెల్సీ అయినప్పటికీ శిలాఫలకంలో ఎమ్మెల్సీగా పేరు పెట్టిన టీటీడీ అధికారులపై న్యాయపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు శ్రీనివాసులు యాదవ్, దేవరబండ వెంకట నారాయణ, అభిరెడ్డిపల్లె గోవిందు, జయన్న యాదవ్, మిద్దెపల్లి గోవిందు, సర్పంచ్ రామిరెడ్డి, గోసానిపల్లి మల్లయ్య, అజీజ్, కొచ్చెర్వు రామాంజనేయులు, కాశీ విశ్వనాథ్, వినయ్ చౌదరి పాల్గొన్నారు.

విద్యార్థులతో పెయింటింగ్ పనులు



వైపీపీఎం పాఠశాలకు రంగులు వేస్తున్న విద్యార్థులు

నంద్యాల, ఫిబ్రవరి 21(ఆంధ్రజ్యోతి): ఆళ్లగడ్డ పట్టణంలోని ప్రభుత్వ వైపీపీఎం పాఠశాలలో విద్యార్థులతో హెచ్ఎం రాఘవయ్య పెయింటింగ్ పనులు చేయించారు. ప్రధానంగా పాఠశాల భవనాలకు రంగులు వేయించారు. హెచ్ఎంను వివరణ కోరగా పాఠశాలకు రంగులు వేసే అతనికి హెల్పర్లుగా ఉన్నారని చెప్పారు.

ఉత్సవమూర్తులకు పట్టు వస్త్రాలు

రుద్రవరం, ఫిబ్రవరి 21: మండలంలోని టి.లింగందిన్నె గ్రామంలో ఉత్సవమూర్తులకు కర్ణమయ్య కుటుంబ సభ్యులు పట్టు వస్త్రాలను బుధవారం సమర్పించారు. ఈ వస్త్రాలను జ్వాలా లక్ష్మీనరసింహస్వామి ప్రహ్లాద వరదస్వామికి అలంకరించారు. అలాగే పూలమాలలతో ముస్తాబు చేశారు. భారీ సంఖ్యలో తెలుపు తెలుపు వద్దకు భక్తులు తరలివచ్చి ఉత్సవమూర్తుల దర్శనం చేసుకున్నారు. ఈపూజల్లో ఐసీడీఎస్ సూపర్‌వైజరు సుశీల, వీఆర్వో ఓబయ్య, కార్యదర్శి హరికృష్ణ పాల్గొన్నారు.

ఘనంగా మాతృ భాషా దినోత్సవం

కోవెలకుంట్ల, ఫిబ్రవరి 21: స్థానిక శ్రీవాసవి బొమ్మిడాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు అధ్యాపకురాలు కృష్ణశశాంక ఆధ్వర్యంలో అంతర్జాతీయ మాతృ భాషా దినోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. ఈసందర్భంగా ప్రిన్సిపాల్ రామసుబ్బారెడ్డి మాతృభాష గొప్పదనాన్ని గురించి వివరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు లక్ష్మీదేవి, నరేంద్రారెడ్డి, హసన్‌బాషా, విద్యార్థులు పాల్గొన్నారు.

చాగలమర్రి: చాగలమర్రిలోని చైతన్య భారతి పాఠశాలలో అపుస్మా ఆళ్లగడ్డ యూనిట్ ఆధ్వర్యంలో యూనిట్ అధ్యక్షుడు మల్లికార్జున ఆధ్వర్యంలో అంతర్జాతీయ మాతృ భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తెలుగుతల్లి చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అపుస్మా నంద్యాల డివిజన్ అధ్యక్షుడ టి.అమీర్‌బాషా, ఎంఈవో అనూరాధను సన్మానించారు. హెచ్ఎంలు చంద్రకళ, రసూల్, పాఠ శాల డైరెక్టర్ చంద్రమౌళి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రుద్రవరం: రుద్రవరం ఆదర్శ పాఠశాలలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. తెలుగుతల్లి చిత్రపటానికి పూలమాల వేసి పూజ చేశారు. ప్రిన్సిపాల్ నాగేశ్వరరావు మాట్లాడుతూ ఇతర భాషలు నేర్చుకో వడంలో తప్పులేదని, వాటి ప్రభావం మాతృ భాషపై పడకుండా చూసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తెలుగు ఉపాధ్యాయులు కిరణ్‌కుమార్, వెంకటరమణ పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన

చాగలమర్రి, ఫిబ్రవరి 21: చాగలమర్రిలోని బాలికోన్నత పాఠశాలలో బాలికల కోసం తయారు చేసిన మధ్యాహ్న భోజనాన్ని ఎంఈవో న్యామతుల్ల బుధవారం పరిశీలించారు. బాలికలకు నాణ్యతగల భోజనం, కోడిగుడ్లు ఇవ్వాలని సూచించారు.